www.suryaa.news

# ప్రభాత సూర్య

తెలుగు జాతీయ దిన పత్రిక

వెల రూ.5/ - పేజీలు : 8 శనివారం 24 మే 2025 సంపుటి: 01, సంచిక : 21

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## లాభాల్లో ట్రేడవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు ప్రధాన షేర్లలో కొనుగోళ్ల అండతో ప్రస్తుతం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9 గంటల 27 నిముషాల సమయంలో సెన్సెక్స్ 235 పాయింట్ల లాభంతో 81,251 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 114 పాయింట్ల లాభంతో 24,728 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎటర్నల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐటీసీ, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టెక్ మహీంద్రా, నెస్లే ఇండియా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్ లాంటి షేర్లు లాభాల్లో

విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news

# మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా


## రాష్ట్రాభివృద్ధికి సహకారం తప్పక తీసుకుంటా



- ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు
- ప్రతిపక్ష పదవి ఫామ్‌హౌస్‌లో పడుకోవడానికి కాదు
- అసెంబ్లీకి హాజరై తప్పొప్పులు చెబితే దిద్దుకుంటాం
- మహిళలకు ఈ ఏడాది 21 వేల కోట్ల రుణాలు
- అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేయాలి
- 5612 నిమ్జ్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు

సూర్య సంగారెడ్డి

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడతానని, ఆ తర్వాత అందరినీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన పని అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటానని చెప్పారు. నిధుల కోసం ప్రధాని నరేంద్రమోదీని ఎన్నిసార్లయినా కలుస్తానని, రావాల్సిన నిధులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే ఏమవుతుందో తెలుసునని, - మిగతా2లో




## ఈశాన్యంలో అసాధారణ అభివృద్ధి

- వైవిధ్యమే ఈశాన్యానికి అతిపెద్ద బలం
- ఇక్కడ పెట్టుబడులకు, వ్యాపారాభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయి
- ప్రధానంగా ఇంధనం, సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులకు
- ఈశాన్య రాష్ట్రాలు గమ్యస్థానంగా మారాయి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ


వివరాలు 3లో..



## ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదు

- సుప్రీంకోర్టు పనితీరుపై జస్టిస్ ఓకా ఆవేదన
- పూర్తిగా సీజేఐ కేంద్రంగా కార్యకలాపాలు
- హైకోర్టుల్లోనే మెరుగైన ప్రజాస్వామ్యం
- వీడ్కోలు ప్రసంగంలో సంచలన వ్యాఖ్యలు
- 'సీజేఐ-కేంద్రిత' ఇమేజీని వదిలించుకోవాలి
- పారదర్శకత, హేతుబద్ధత తక్షణావసరాలు
- లిస్టింగ్ నుంచి పనితీరు దాకా కన్పించాలి
- అధికారాలను పూర్తిగా వికేంద్రీకరించాలి
- కీలక సూచనలు చేసిన న్యాయమూర్తి

3




## 'మైసూర్'లో 'పాక్' మాయం!

- దాయాది పేరుందని స్వీట్ల పేరు మార్పు
- పాక్ ఉన్నచోట శ్రీ అని చేరుస్తున్న దుకాణాలు

# రెండ్రోజుల్లో కేరళకు నైరుతి



- అత్యంత చురుగ్గా రుతుపవనాలు
- 27న బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా 'అరేబియా' అల్పపీడనం!
- మోస్తరు వర్షాలకు చాన్స్.. ఎల్లో అలర్ట్ జారీ

సూర్య హైదరాబాద్

నైరుతి రుతుపవనాల కదలిక అత్యంత చురుకుగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం బంగాళాఖాతంలో చురుకుగా సాగుతున్న రుతుపవనాలు రానున్న రెండ్రోజుల్లో కేరళను తాకేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. మరోవైపు ఈ నెల 27న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఈ అల్పపీడనం క్రమంగా - మిగతా2లో

## ఈడీ చార్జిషీట్‌లో రేవంత్ పేరుపై రాహుల్ సమాధానం చెప్పాలి

### భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్

సూర్య హైదరాబాద్

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరును ఈడీ చార్జిషీట్‌లో నమోదు చేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్పందిస్తూ శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. - మిగతా2లో



## ఏ తప్పూ చేయకుంటే భయమెందుకు?




- నోటీసులకే వణుకుతున్న భారాస పెద్దలు
- అవినీతితో జేబులు నింపుకొనేందుకే కాళేశ్వరం
- విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తప్పవు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సూర్య హైదరాబాద్

"ఏ తప్పూ చేయకుంటే భయమెందుకు? కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇస్తే భారాస పెద్దలు వణికిపోతున్నారు. మీడియా ముందు మాట్లాడే బదులు కమిషన్‌కు వివరణ ఇవ్వొచ్చుగా..! బ్యారేజీల పనుల్లో దోపిడీ జరిగినట్లు విజిలెన్స్, కాగ్, ఎన్డీఎస్ఏ సంస్థలు నివేదికలిచ్చాయి. కాళేశ్వరం కమిషన్ రిపోర్టు వచ్చాక అధికారులతోపాటు బాధ్యులందరిపై చట్టప రమైన చర్యలు తప్పవు" అని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్‌లతో కలిసి విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... "భారాస వికృత, - మిగతా2లో



## తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు

- అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రం.. కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్
- జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం కూడా
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

సూర్య హైదరాబాద్

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త సంస్థలను ఏర్పాటు చేయబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన - మిగతా2లో

# తెలంగాణ కులగణనను దేశవ్యాప్తం చేయండి

- ఆ మోడల్ అనుసరణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- కాంగ్రెస్ నేతలకు ఖర్గే, రాహుల్ దిశానిర్దేశం
- రాష్ట్రంలో నిర్వహించిన సర్వేపై మహేశ్‌గౌడ్ వివరణ
- అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించిన వైనం



సూర్య హైదరాబాద్

దేశంలో సామాజిక న్యాయా న్ని సాధించే దిశగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను దేశ వ్యాప్తంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు, పార్టీ అధికార ప్రతినిధులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సూచించారు. తెలంగాణ తరహా మోడల్‌ను అనుసరించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. భారత్ జోడో పాదయాత్ర సందర్భం గా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం జనగణన చేసి చూపించి దేశానికే మార్గదర్శిగా నిలిచిన అంశాన్ని ప్రజలకు వివరించాలని, ఈ విషయంలో కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధతను చాటి - మిగతా2లో

# మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా

-మొదటిపేజీ తరువాయి

గత ముఖ్యమంత్రి చెరువు మీద అలిగి ఫామ్‌హౌసలో పడుకుంటే ఏమైందో అందరూ చూశారని వ్యాఖ్యానించారు. అందుకే సోనియా, రాహుల్, ఖర్గే సూచనలు పాటిస్తూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచేలా ప్రయత్నిస్తున్నానన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, కేంద్రీయ విద్యాలయం, నిమ్జ్ ఫోర్ లేన్ రహదారితోపాటు, బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇండస్ట్రీలు, ఫార్మా, ఐటీ రంగాల్లో ప్రగతి సాధించాల్సి ఉందన్నారు. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే సంక్షేమ నినాదంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిననే అహంభావం తనకు ఏమాత్రం లేదని రేవంత్ అన్నారు. ఎప్పటిలాగే పేదోడు, పెద్దోడు అనే తేడా లేకుండా ఎవరినైనా కలుస్తున్నానన్నారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా 20 ఏళ్లపాటు రాజకీయంలో ఉన్నా.. గతంలో ఏనాడూ అధికారంలో లేనని, అయినా ప్రజల్లో ఉన్నందునే ఈరోజు ముఖ్యమంత్రిగా అందరి ముందుకు వచ్చానని పేర్కొన్నారు. ప్రతిపక్షంలోనూ, అధికార పక్షంలోనూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని తెలిపారు.

**ప్రతిపక్ష నేత ఫాంహౌసకే పరిమితమా..?**

ప్రశ్నించే గొంతుకగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత ఫాంహౌసలో పడుకుంటారా? అధికారం ఉంటేనే అసెంబ్లీలో అడుగుపెడతారా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. శాసనసభకు వచ్చి ఆయన అనుభవంతో తమ తప్పొప్పులు చెబితే సరిదిద్దుకుంటామని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులతో అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలు వ్యాపారం చేయాలని ఆకాంక్షించారు. మెదక్ అంటేనే ఇందిరమ్మ అని, ఆమె మెదక్ ఎంపీగా గెలిచి ప్రధానమంత్రి అయ్యారని రేవంత్ గుర్తు చేశారు. బీడీఎల్, బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్ సంస్థలు ఇందిరమ్మ చొరవతోనే ఏర్పాటయ్యాయన్నారు. కాగా, జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్ పారిశ్రామిక కారిడార్‌లో 450 ఎకరాలను హ్యుందాయ్ కార్ల పరిశ్రమకు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. హ్యుందాయ్ పరిశ్రమతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతంలో చెరుకు పండించే రైతులు ఒక సహకార సంఘంగా ఏర్పాటైతే వారి కోసం 100 ఎకరాలను కేటాయిస్తామని అన్నారు. చక్కెర పరిశ్రమను వారి ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహించుకోవచ్చని సూచించారు. ఇక దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చదిద్దడమే కాకుండా న్యూయార్క్, టోక్యో నగరాలతో పోటీపడే విధంగా హైదరాబాద్ మారుతుందని చెప్పారు. మంజీరా జలాలతో హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్న సింగూరు రిజర్వాయర్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. వార్డుమెంబరు నుంచి పార్లమెంటు మెంబరు వరకు కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకోవడానికి తన శాయశక్తులా కష్టపడతానన్నారు. కాగా, జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప నాయకుడని, సమాజంలో అణచివేతకు గురైన బలహీనవర్గాల తరపున నిలబడ్డాడని కొనియాడారు. ఆ రోజుల్లో అనుభవ మంటపాలను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేవారని తెలిపారు. ఆ అనుభవ మంటపాల ఆధారంగానే నేడు అసెంబ్లీ పార్లమెంటులో సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతున్నామని చెప్పారు.

**విద్యార్థులతో ముఖ్యమంత్రి మాటామంతీ**

ఝరాసంగం: దేశ, రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని సీఎం రేవంత్ అన్నారు. చదువుల్లో రాణించాలని. తల్లిదండ్రులు గర్వపడేలా సమాజంలో మంచి పేరు తేవాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల పరిధి మాచనూరు సమీపంలో రూ.26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయం భవనాన్ని శుక్రవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులను సీఎం ఆత్మీయంగా పలకరించారు. “ఏ తరగతి చదువుతున్నారు? ఇక్కడ చదువు బాగా చెబుతున్నారా?” అని ప్రశ్నించారు.బాగా చదువుకోవాలని సూచించారు.

**నిమ్జ్ నిర్వాసితుల బాధ్యత జగ్గారెడ్డికి: సీఎం రేవంత్**

జహీరాబాద్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయడానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిమ్జ్‌కు శ్రీకారం చుట్టారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే జరిగిన భూసేకరణలో నిర్వాసితులైన వారికి నష్టపరిహారం చెల్లించారని, పెండింగ్‌లో ఉన్న పరిహారం చెల్లింపు కూడా పూర్తవుతుందని అన్నారు. నిర్వాసితులైన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ బాధ్యతను సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. నిర్వాసితులకు మంచి భోజనం పెట్టించి వారికి ప్రభుత్వపరంగా పట్టాలు ఇప్పించే బాధ్యతను జగ్గారెడ్డి తీసుకోవాలని సూచించారు.

# ఏ తప్పూ చేయకుంటే భయమెందుకు?

- మొదటిపేజీ తరువాయి

వికారచేష్టలకు పాల్పడుతోంది. కాళేశ్వరంలో అవకతవకలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, మొదటి లోక్‌పాల్ అధ్యక్షతన కమిషన్ విచారణ జరుగుతోంది. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు నోటీసులు ఇచ్చింది. దాంతో కమిషన్‌పై, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఉక్కు మహిళ ఇందిరాగాంధీలాంటి వారే కమిషన్ల ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. మీరెందుకు భయపడుతున్నారు... ఇంకా చర్యలు లేకుండానే అడ్డగోలు ఆరోపణలు ఎందుకు చేస్తున్నారు? జ్యుడిషియల్ రిపోర్టు ఆధారంగానే చట్టపరమైన చర్యలుంటాయి.

**అంచనా పెరిగినా ఆయకట్టు పాతదే**

ఉమ్మడి రాష్ట్రంలో తుమ్మిడిహెట్టి వద్ద రూ.35 వేల కోట్లతో ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతలకు శంకుస్థాపన జరిగింది. తెలంగాణ ఏర్పడి కేసీఆర్ అధికారం చేపట్టేవరకు రూ.10 వేల కోట్లు ఖర్చయ్యాయి. దీనికింద 18 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. పునరాకృతి పేరుతో ఈ ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చారు. అంచనాలను రూ.80 వేల కోట్లకు పెంచగా... అదికాస్త రూ.1.20 లక్షల కోట్లకు పెరిగినట్లు కాగ్ రిపోర్టు వెల్లడించింది. ఆయకట్టు మాత్రం పాతదే. పునరాకృతి వారి జేబులు నింపుకోవడానికే కానీ... రైతులకు నీళ్లివ్వడానికి కాదు. తుమ్మిడిహెట్టి వద్ద ఒక్క పంపునే ఏర్పాటుచేసి గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లిని నింపొచ్చు. రూ.35 వేల కోట్లతో ప్రాణహిత-చేవెళ్ల నిర్మించి ఉంటే మిగిలిన నిధులతో డిండి, సీతారామ, దేవాదుల, పాలమూరు, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు పూర్తిచేసుకునే అవకాశముండేది.

**2019 ప్రారంభంలోనే లోపాలు బహిర్గతం...**

భారాస అధికారంలో ఉన్నప్పుడే 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగింది. అప్పటి అధికారులే బ్యారేజీ కింద రంధ్రాలు పడ్డాయని, నష్టం జరిగిందని



ఎన్డీఎస్ఏకు వివరాలిచ్చారు. వాటినే ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికలో పేర్కొంది. 2019 ప్రారంభంలోనే లోపాలు బయటపడినా... బ్యారేజీలను నీళ్లతో నింపి వెలుగులోకి రాకుండా చూశారు. అప్పుడే వాటిని బాగుచేసుంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదేమో. ‘పగుళ్లకే బ్యారేజీ మొత్తం పోతుందా’ అంటూ... తప్పుడు ప్రచారం చేస్తున్న కేటీఆర్ తన పేరును గోబెల్స్‌రావుగా మార్చుకుంటే సరిపోతుంది. వారిలాగా మాట్లాడటం మాకు చేతకాదు. మేం నిబద్ధతతో ముందుకెళ్తున్నాం. ఇప్పుడు బ్యారేజీలలో నీటిని నింపితే... ఒకవేళ ఏదైనా ప్రమాదం జరిగిందంటే దిగువన 40 గ్రామాలు, భద్రాచలంతోపాటు సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్‌లు కొట్టుకుపోతాయి.

**కాళేశ్వరం కమిషన్ స్వతంత్ర సంస్థ**

కాళేశ్వరంపై కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ సంస్థలు నివేదికలిచ్చాయి. బ్యారేజీల డిజైన్లు, నిర్మాణాలు, నిర్వహణలో లోపాలు ఉన్నాయంటూ వెల్లడించాయి. వీటిపైనే కాళేశ్వరం కమిషన్ పారదర్శకంగా విచారణ చేస్తోంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేదు. విచారణలో భాగంగానే కమిషన్ నోటీసులిస్తే... బ్యారేజీల్లో కాంగ్రెస్ నాయకులే బాంబులు పెట్టారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. భారాస అధికారంలో ఉన్నప్పుడు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌నే కొనసాగిస్తాం. మీ వద్ద ఉన్న ఆధారాలతో కమిషన్ ఎదుట హాజరుకండి. భారాస ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.21 వేల కోట్లు వృథాగా మారితే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండాలా? ఇలాంటి తప్పుడు పనులే విదేశాల్లో జరిగితే తీవ్ర శిక్షలుంటాయి. మా ప్రభుత్వం బ్యారేజీలను వినియోగంలోకి తీసుకురావడానికే ప్రయత్నిస్తోంది. వర్షాకాలానికి ముందే పరీక్షలు నిర్వహిస్తాం. భారాస ప్రభుత్వం పదేళ్లపాటు కాళేశ్వరం మినహా అన్ని ప్రాజెక్టులను మూలకు పెట్టేసింది. రెండు దశాబ్దాలపాటు పనులు చేయకుండా వదిలేయడంతోనే ఎస్ఎల్‌బీసీలో పైకప్పు కూలింది. నీటిపారుదల శాఖను ధ్వంసం చేసింది. మా ప్రభుత్వం అన్నింటినీ సరిచేస్తోంది” అని వివరించారు.

# తెలంగాణకు సివిల్ సప్లైస్ భవన్

హైదరాబాద్

హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లైస్ భవన్‌ను తెలంగాణ పౌరసరఫరాల సంస్థ ఇకపై పూర్తిస్థాయిలో ఉపయోగించుకోనుంది. ఇప్పటివరకు ఇందులో సగభాగం తెలంగాణ, మిగతా సగం ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల సంస్థల అధీనంలో ఉన్నాయి. తమకున్న 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఏరియాని తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ అప్పగించనుంది. జూన్ ఒకటి నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. ఏపీ భాగం ఖాళీగా ఉండగా, తమ భాగం ఆఫీసు అవసరాలకు సరిపోవడం లేదంటూ తెలంగాణ పౌరసరఫరాల విన్నవించగా ఈ నిర్ణయం జరిగింది. ఇదే విషయాన్ని శుక్రవారం తెలంగాణ, ఏపీ పౌర సరఫరాల శాఖల మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నాదెండ్ల మనోహర్‌లు సంయుక్తంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన విధివిధానాలను మున్ముందు రూపొందిస్తామని నాదెండ్ల తెలిపారు.

**ఆస్తుల బదిలీపై చర్చలు**

సివిల్ సప్లైస్ భవన్‌లో శుక్రవారం జరిగిన రెండు రాష్ట్రాల పౌర సరఫరాల శాఖల సమావేశానికి మంత్రులు ఉత్తమ్, నాదెండ్లతోపాటు కమిషనర్లు డీఎస్ చౌహాన్, సౌరభ్‌గౌర్ హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఏపీ మంత్రి, కమిషనర్‌లు హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సమావేశంలో... ఆస్తులు, పౌర సరఫరాల శాఖలో ఉత్తమ టెక్నాలజీ, ఇరురాష్ట్రాల మధ్య ధాన్యం అక్రమ రవాణా అడ్డుకట్టపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. “తెలంగాణ పౌర సరఫరాల శాఖకు సంబంధించిన అన్ని విభాగాలను సివిల్ సప్లైస్ భవన్‌కు తీసుకురావాలని నిర్ణయించి నాదెండ్లతో సంప్రదించాం. ప్రాథమికంగా సివిల్ సప్లైస్ భవన్‌లో ఏపీకి ఉన్న సగభాగాన్ని తెలంగాణకు ఇవ్వబోతున్నారు. పౌరసరఫరాల సంస్థకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఆస్తుల పంపకాలపై ఉన్న సమస్యలపై చర్చలతో ముందడుగ్గేస్తాం. 10వ షెడ్యూల్‌లోని కొన్ని కార్పొరేషన్లకున్న ఆస్తులను మొత్తంగా తెలంగాణకు బదిలీ చేసే విషయంపై చర్చిస్తున్నాం. సివిల్‌సప్లైస్ భవన్ మొత్తాన్ని మేం టేకోవర్ చేస్తున్నాం. శాంతిశిఖర అపార్ట్‌మెంట్‌లో ఉద్యోగులుండే 16 ఫ్లాట్లను సైతం ఏపీ క్రమక్రమంగా తెలంగాణకే అప్పగించనుంది” అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు.

**తెలంగాణకు మనస్ఫూర్తిగా ఇస్తున్నాం: నాదెండ్ల**

“తెలుగు రాష్ట్రాలు ఒకరికి ఒకరు సహాయంగా ఉండాలి. సివిల్‌సప్లైస్ భవన్‌లో ఏపీకి చెందిన 25 వేల చదరపు అడుగుల స్థలాన్ని తెలంగాణకు ఉపయోగపడేలా మనస్ఫూర్తిగా ఇస్తున్నాం. తెలంగాణ పౌరసరఫరాల సంస్థ కొన్ని అద్భుతమైన సంస్కరణలు అమలు చేస్తోంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ తొలిసారి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతిని ప్రారంభించింది. విదేశాలకు తెలంగాణ బియ్యం ఎగుమతులను పెంచడానికి ఏపీలోని కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం వంటి పోర్టుల్లో తెలంగాణ కోసం చేయగలిగే ఏర్పాట్లపై సమావేశంలో చర్చించాం” అని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టంచేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ ముందుంది. ఇక్కడ అద్భుతంగా ధాన్యం దిగుబడులు వచ్చాయని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. “ఇరురాష్ట్రాల్లోనూ రికార్డుస్థాయిలో ధాన్యం ఉత్పత్తి జరిగింది. ధాన్యం అమ్మకాలపై రైతులు ప్రభుత్వాలపైనే అధికంగా ఆధారపడి ఉన్నారు. గతంలో ఇంతగా ఉండేది కాదు. కొనుగోళ్లలో సమస్య రాకుండా అన్నదాతలను కాపాడాలన్న ఆలోచనలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఉన్నారు” అని ఆయన వివరించారు.

అద్దె ఒప్పందం జరిగింది: సివిల్‌సప్లైస్ భవన్‌ను తెలంగాణ పౌరసరఫరాల సంస్థ అద్దెకు తీసుకునేందుకు ఏపీ ప్రభుత్వం అంగీకరించినట్లు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## తెలంగాణ కులగణనను దేశవ్యాప్తం చేయండి

-మొదటిపేజీ తరువాయి

చెప్పాలని సూచించారు. దేశంలోని అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ అంశాల్లో న్యాయం చేసేలా జనగణనలో భాగంగా కులగణను ఎప్పట్లోగా కేంద్రం పూర్తి చేస్తుందో చెప్పాలంటూ బలంగా డిమాండ్ చేయాలని అన్నారు. శుక్రవారం ఇందిరా భవన్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధులు, ముఖ్య నేతలతో కులగణన అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాహుల్‌గాంధీ పాల్గొనగా, ఖర్గే వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించిన తీరు, ప్రశ్నాపత్రం, వివిధ వర్గాల భాగస్వామ్యం, అసెంబ్లీ తీర్మానం వంటి అంశాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అత్యంత పారదర్శకంగా, పూర్తి నిబద్ధతతో పూర్తి చేయడమే కాకుండా విద్యా, ఉపాధి, రాజకీయ రంగాల్లో దీనిని అమలు పరిచేలా తీసుకుంటున్న చర్యలను సమావేశం దృష్టికి తెచ్చారు.

**సైద్ధాంతిక నిబద్ధతకు నిదర్శనం: ఖర్గే**

సమావేశంలో ప్రారంభోపన్యాసం చేసిన ఖర్గే.. తెలంగాణలో కులగణన చేపట్టడాన్ని మరోసారి అభినందించారు. ‘తెలంగాణలో జరిగిన కుల సర్వే సమాజం, నిపుణులు, ప్రభుత్వం అందరూ పాల్గొన్న ఒక నమూనాను ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రజా, స్నేహపూర్వక, పారదర్శక నమూనాను అవలంబించాలని మేము కోరుకుంటున్నాం. ఈ ప్రక్రియలో సహకరించడానికి సిద్ధంగా ఉన్నాం..’అని అన్నారు. కులగణన సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటం మాత్రమే కాదని, రాజ్యాంగం ఆత్మను కాపాడుకునే పోరాటమని పేర్కొన్నారు. కులగణన అంశాన్ని కేవలం ఎన్నికల అంశంగా పరిగణించవద్దని, ఇది పార్టీ సైద్ధాంతిక నిబద్ధతకు నిదర్శనం అన్న విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. పార్టీ అధికార ప్రతినిధులుగా కులగణన అంశాన్ని వాస్తవాలతో, సున్నితత్వంతో, భయం లేకుండా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖర్గే సూచించారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో దళిత, ఓబీసీ, ఆదివాసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని వెంటనే అమలు చేసేలా గొంతును పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.

**ప్రజాస్వామ్యం నైతిక బాధ్యత: రాహుల్**

పార్టీ మేనిఫెస్టోలో, పార్లమెంటులో, వీధుల్లో, సామాజిక న్యాయం గురించి చర్చించాల్సిన ప్రతి వేదికపై కాంగ్రెస్ దీనిని లేవనెత్తిందని రాహుల్‌గాంధీ గుర్తు చేశారు. తాము హామీ ఇచ్చినట్లుగా తెలంగాణలో అమలు చేసి చూపామన్నారు. కులగణన భారత ప్రజాస్వామ్యం నైతిక బాధ్యత అని పేర్కొన్నారు. కులగణనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. కులగణనతో రాష్ట్రంలో కులాల వారీగా లెక్కలు తేలాయని, వీటి ఆధారంగా ఎవరికి ఎంత రిజర్వేషన్లు దక్కాలో తెలిసిందని అన్నారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానించి కేంద్రం ఆమోదానికి పంపామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కృషి చేస్తున్నామన్నారు.

## తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు

-మొదటిపేజీ తరువాయి

ఆయన.. 2014 నుంచి రాష్ట్రానికి కొత్తగా పలు కేంద్ర సంస్థలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మూడు కేంద్ర సంస్థల గురించి వెల్లడించారు. మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచే క్రమంలో భాగంగా మోదీ సర్కారు తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. రూ.250 కోట్లతో ‘గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్’ను కేంద్ర వ్యవసాయ శాఖ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుందని ఆయన పేర్కొన్నారు. అలాగే.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ‘కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ను ప్రారంభం కానుందని.. జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను) కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర నుంచి, పరిశ్రమల నుంచి ‘ట్రిపుల్ ఆర్ ట్యాక్స్’ పేరిట భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## ఈడీ చార్జిషీట్‌లో రేవంత్ పేరుపై రాహుల్ సమాధానం చెప్పాలి

-మొదటిపేజీ తరువాయి

సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో విలేకరులతోనూ మాట్లాడారు. “ఎన్ని నాటకాలు ఆడినా రేవంత్‌రెడ్డి అవినీతి ఈడీ చార్జిషీట్ సాక్షిగా బయటపడింది. కాంగ్రెస్ పార్టీ జనాన్ని పూర్తిగా వంచించింది. ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. ముఖ్యమంత్రి పేరు.. ఈడీ చార్జిషీట్‌లో రావడం తెలంగాణ రాష్ట్రానికి అవమానకరం. 18 నెలల కాంగ్రెస్ పాలన కుంభకోణాలమయం. రేవంత్‌రెడ్డి అవినీతిపై మేం లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేం ప్రస్తావించిన స్కామ్‌లపై చర్యలు తీసుకుంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది” అని కేటీఆర్ పేర్కొన్నారు.

**రేవంత్ బండారం బహిర్గతం: వేముల**

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విరాళాల కోసం ఒత్తిడి తీసుకొచ్చారని ఈడీ పేర్కొందని, ఈడీ చార్జిషీట్‌తో రేవంత్ బండారం బహిర్గతమైందని భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు. “కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని మేం చెబుతూనే ఉన్నాం. ఈడీ చార్జిషీట్‌తో మరోమారు స్పష్టమైంది” అని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.ల

## రెండ్రోజుల్లో కేరళకు నైరుతి

-మొదటిపేజీ తరువాయి



బలపడే అవకాశం ఉందని తెలిపింది. నైరుతి రుతుపవనాల సమయంలో బంగాళాఖాతంలో ఏర్ప డే అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం ఉంటుంది. గురువా రం తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కొంకణ్%-%గోవా తీర ప్రాంతం సమీపంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం మరింత బలపడి శు క్రవారం ఉదయం 5.30 గంటలకు స్పష్టమైన అల్పపీడనంగా మారిందని, ఇది క్ర మంగా బలపడి శనివారం ఉదయానికల్లా వాయుగుండంగా మారే అవకా శం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదు కావొచ్చని సూచించింది. ఈ మేరకు రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు**

శుక్రవారం రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే.. ఖమ్మంలో అత్యధికంగా 36.0 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, కనిష్టంగా మెదక్‌లో 20.0 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండురోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీ సెల్సియస్ వరకు తక్కువగా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ తెలిపింది.

# ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదు

న్యూఢిల్లీ

"సుప్రీంకోర్టు చాలావరకు ప్రధాన న్యాయమూర్తిపైనే ఆధారపడి పని చేస్తోంది. అది సరికాదు. అత్యున్నత న్యాయస్థానం 'సీజేఐ%-%కేంద్రిత' ఇమేజీని తక్షణం వదిలించుకోవాల్సిన అవసరం చాలా ఉంది" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా అభిప్రాయపడ్డారు. "సుప్రీంకోర్టు ఇటీవలే 75 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సుదీర్ఘ ప్రస్థానంలో దేశానికి ఎంతో సేవ చేసిందనడంలో సందేహం లేదు. కానీ ప్రజలు తనపై పెట్టుకున్న ఆకాంక్షలను మాత్రం నెరవేర్చలేకపోయిందన్నది నా వ్యక్తిగత అభిప్రాయం" అని చెప్పారు. "సుప్రీంకోర్టుకు ఇది ఉత్సవ సమయం కాదు. ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన సందర్భం" అని హితవు పలికారు. అంతేకాదు, సుప్రీంకోర్టు కంటే హైకోర్టుల పనితీరే ప్రజాస్వామికంగా ఉంటుందని ఆయన కుండబద్దలు కొట్టారు! "హైకోర్టుల్లో తొలి ఐదు న్యాయమూర్తులతో కూడిన పాలక కమిటీ ఉంటుంది. అదే ప్రధాన నిర్ణయాలన్నీ తీసుకుంటుంది. కమిటీలు, నిర్ధారిత రోస్టర్ల ద్వారా హైకోర్టుల్లో కార్యకలాపాలు సజావుగా సాగిపోతాయి. కానీ సుప్రీంకోర్టులో అలా కాదు. కార్యకలాపాలన్నీ ప్రధానంగా సీజేఐ ఆధారితంగా సాగుతాయి" అంటూ ఆక్షేపించారు. "సుప్రీంకోర్టు అధికారాలను పూర్తిగా వికేంద్రీకరించాలి. కేసుల లిస్టింగ్ పూర్తి పారదర్శకంగా జరగాలి. లిస్టింగ్, కోర్టు కార్యకలాపాల నిర్వహణలో టెక్నాలజీ వాడకం మరింతగా పెరగాలి" అంటూ కీలక సూచనలు చేశారు. ఇవన్నీ ప్రస్తుత సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ హయాంలోనే కార్యరూపం దాలుస్తాయని ఆశాభావం వెలిబుచ్చారు. జస్టిస్ ఓకా శుక్రవారం రిటైరయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతూ పలు కీలకాంశాలను లేవనెత్తారు. "హైకోర్టులతో పోలిస్తే సుప్రీంకోర్టు తన పనితీరు విషయంలో సీజేఐపై విపరీతంగా ఆధారపడుతుంది. అక్కడ న్యాయమూర్తిగా చేసిన ఈ మూడేళ్లలో దీన్ని బాగా గమనించాను. సుప్రీంకోర్టులో దేశ నలుమూలల నుంచి వచ్చే 34 మంది న్యాయమూర్తులు ఉంటారు. అలాంటప్పుడు సీజేఐ ఆధారిత ఇమేజీ ఏమాత్రమూ సరికాదు. సుప్రీంకోర్టు



మరింత సమ్మిళిత, నిర్మాణాత్మక వ్యవస్థగా మారాల్సిన అవసరముంది" అని స్పష్టం చేశారు.

**లిస్టింగ్ సమస్యలు**

సుప్రీంకోర్టులో కేసుల లిస్టింగ్ విషయంలోనూ తక్షణం పరిష్కరించాల్సిన అంశాలున్నాయని జస్టిస్ ఓకా చెప్పారు. "కొన్ని కేసులు మర్నాడే విచారణకు వస్తాయని, మరికొన్ని రోజుల తరబడి పెండింగ్‌లో ఉండిపోతాయని చాలామంది ఫిర్యాదు చేస్తున్నారు. కేసుల లిస్టింగ్ విషయంలో హైకోర్టులు ఫిక్స్‌డ్ రోస్టర్‌ను పాటిస్తాయి. సుప్రీంకోర్టు కూడా ఈ విషయంలో పూర్తి పారదర్శక విధానాన్ని అనుసరించాలి" అని సూచించారు. "కేసుల లిస్టింగ్‌లో హేతుబద్ధత చాలా ముఖ్యం. వాటిని ఎవరూ వేలెత్తి చూపకుండా చూసుకోవాలి. మానవ ప్రమేయాన్ని పూర్తిగా తగ్గిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.
ఇందుకు కృత్రిమ మేధ తదితర పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి. సుప్రీం కేవలం రాజ్యాంగ న్యాయస్థానం మాత్రమే కాదు. అపెలైట్ కోర్టు కూడా. కనుక రోజువారీ విధుల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత వంటివి చాలా ముఖ్యం" అని కుండబద్దలు కొట్టారు. న్యాయవ్యవస్థకు వెన్నెముక వంటి ట్రయల్, జిల్లా కోర్టులను హైకోర్టులు, సుప్రీంకోర్టు చిరకాలంగా నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నాయని జస్టిస్ ఓకా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్రయల్ కోర్టుల్లో 30 ఏళ్లుగా పెండింగ్ కేసులు భారీగా పేరుకుపోయాయని గుర్తు చేశారు.

**వీడ్కోలు ప్రసంగాలు అంత ఈజీ కాదు**

వీడ్కోలు ప్రసంగాలు రాసుకోవడం అంత సులువు కాదంటూ చమత్కరించారు. "గత రెండు వారాలు భా రంగా గడిచా యి. ఎన్నో తీర్పు లు రాయాల్సొచ్చింది. వాటిని బుధవారానికల్లా పూర్తి చేసి గురువారం వీడ్కోలు ప్రసంగం సిద్ధం చేసుకుందామనుకున్నా. కానీ ఊపిరి సలపని కార్యభారం వల్ల కుదరనే లేదు" అని చెప్పుకొచ్చారు. న్యాయమూర్తిగా రెండు దశాబ్దాల పై చిలుకు కెరీర్లో మెజారిటీ తీర్పుతో తాను ఎన్నడూ విభేదించలేదన్నారు. ఇప్పట్లో ఇంటర్వ్యూలు ఇవ్వబోనని స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడేందుకు కాస్త సమయం కావాలన్నారు.

**నమ్మకమిచ్చిన తీర్పరి**
**జస్టిస్ ఓకాపై సీజేఐ ప్రశంసలు**

జస్టిస్ ఓకాకు సీజేఐ గవాయ్ భావోద్వేగభరితంగా వీడ్కోలు పలికారు. ఆయన తన తీర్పు లతో అసంఖ్యాకులకు న్యాయవ్యవస్థపై నమ్మ కం కలిగించారని కొనియాడారు. "దాదాపు సమాంతరంగా సాగిన కెరీర్లు మా ఇద్దరివీ. న్యాయవాదిగా ప్రాక్టీస్ మొదలుపెట్టిన తొలినాళ్లలోనే ఆయన అపార ప్రజ్ఞ అందరినీ ఆకట్టుకుంది. ప్రతి వాదనకూ పూర్తిగా సంసిద్ధమై వచ్చేవారు. న్యాయమూర్తిగానూ అదే ఒరవడి కొనసాగించారు. రెండు రోజుల క్రితమే తల్లిని పోగొట్టుకున్నారు. అయినా అంత్యక్రియలు జరిగిన మర్నాడే విధులకు హాజరై 11 తీర్పులు వెలువరించారు. అంతటి అంకితభావమున్న అద్భుతమైన న్యాయమూర్తికి ఈ రోజు వీడ్కోలు పలుకుతున్నాం" అన్నారు. న్యాయమూర్తులతో పాటు యువ న్యాయవాదులకు జస్టిస్ ఓకా స్ఫూర్తిగా నిలుస్తారన్నారు.

# అటెన్షన్‌లో కేంద్రమంత్రులు

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వస్తున్నారంటే కేంద్ర మంత్రుల్లో గుండె దడ మొదలవు తుంది. ఆయన ఫైళ్లు పట్టుకుని మరీ వచ్చి రాష్ట్రానికి సంబంధించిన నిధులు, ప్రాజెక్టుల కోసం వస్తారు. అందుకే చంద్రబాబు ఢిల్లీ టూర్ అంటే కేంద్ర మంత్రులు ఆయన ఏ ప్రతిపాదనలు తీసుకు వస్తారోనన్న ఉత్కంఠ వారిలో నెలకొంటుందట. ఏ ముఖ్యమంత్రి కూడా ఢిల్లీకి ఇన్నిసార్లు వచ్చి తమ రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, నిధుల కోసం ప్రయత్నించడం లేదని, కానీ చంద్రబాబు మాత్రం నెలలో రెండు సార్లు ఢిల్లీకి వచ్చి తమను కలసి వినతులను సమర్పించి తమ పనులను సాధించుకు వెళుతున్నారని కేంద్ర మంత్రులే అనుకుం టున్నారట. చంద్రబాబు నాయుడు నేడు ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోనే చంద్రబాబు ఉండనున్నారు. నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీకి బయలుదేరి వెళతారు. రేపు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో పాటు ఏడుగురు కేంద్ర మంత్రులతో శుక్రవారం భేటీ కానున్నారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చించనున్నారు. దీంతో చంద్రబాబు వస్తున్నారని, అపాయింట్ మెంట్ కావాలని అడిగిన వెంటనే వారు పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు వివరాలను తెప్పించుకునే పనిలో ఉన్నారట.ముఖ్యంగా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ల మద్దతు పైనే ఆధారపడి ఉంది. వీరిద్దరూ మోదీ కంటే ముందు నుంచి రాజకీయాల్లో ఉన్నవారు. రాజకీయ




అనుభవం ఉన్న నేతలు మాత్రమే కాకుండా తమకు అవసరమైన వాటిని పట్టుబట్టి సాధించుకోవడంలో దిట్టలని పేరుపొందారు. ఇద్దరి నేతల అవసరాలు కూడా కేంద్రానికి ఉండటంతో అడిగిన వెంటనే అపాయింట్ మెంట్లు కూడా ఇచ్చేస్తున్నారు. అందులోనూ ఏపీ పరిస్థితి వేరు. అనేక హామీలు ఇచ్చి 2024 లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో, కేంద్ర ప్రభుత్వంలో రెండు పార్టీలు కలసి ఉన్నాయి..అయినా ప్రజా సమస్యల పరిష్కారం ఇలా చేయొచ్చుగా సామరస్యంగానే చెప్పి... ఈ నేపథ్యంలో చంద్రబాబు తీసుకు వచ్చే ప్రతిపాదనలతో పాటు నిధుల విషయంలో కూడా చూసీచూడనట్లు వ్యవహరించాల్సి ఉంటుంది. చంద్రబాబు కూడా ఒక పట్టాన వదిలి పెట్టే రకం కాదు. ఆయన గత పర్యటనలో తనకు ఇచ్చిన హామీలను ఇంకా పెండింగ్ లో ఉండటాన్ని కూడా ప్రస్తావించి కేంద్ర మంత్రులను ఇరకాటంలో పడేస్తారు. అంతే కాదు సామరస్యంగా, సానుకూలంగా మాట్లాడుతూనే రాష్ట్ర ప్రయోజనాలకు అవసరమైన ప్రాజెక్టులను, నిధులను తీసుకెళ్లడంలో చంద్రబాబు నేర్పరి అని హస్తినలో టాక్. అందుకే చంద్రబాబు హస్తిన ప్రయాణం అంటే టీడీపీ పార్లమెంటు సభ్యుల హడావిడి అటుంచితే.. కేంద్ర మంత్రులు మాత్రం హై అటెన్షన్ లో ఉండాల్సిందేనట.

# భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశాం



**ఢిల్లీ:** దేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు అమిత్ షా.

**ఉరీ, సర్జికల్ స్ట్రైక్**

2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రైక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ స్ట్రైక్ ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది.

**పుల్వామా ఎయిర్ స్ట్రైక్**

ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రైక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది.

**పహల్గామ్ దాడికి, ఆపరేషన్ సిందూర్**

ఇటీవల పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులను వారి మతం ఆధారంగా గుర్తించి హతమార్చారు. ఈ దారుణ ఘటనకు సమాధానంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు, ప్రధానమంత్రి మోదీ రాజకీయ దృఢత్వం కలిసి పనిచేశాయి. చివరకు ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తైంది. ఈ సందర్భంగా ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత సైన్యాన్ని ప్రశంసిస్తున్నాయని షా వెల్లడించారు.

**బీఎస్ఎఫ్ పాత్ర**

ఈ సందర్భంగా బీఎస్ఎఫ్‌ను అమిత్ షా మెచ్చుకున్నారు. భారతదేశానికి అత్యంత సవాలుతో కూడిన సరిహద్దులైన బంగ్లాదేశ్, పాకిస్థాన్ రక్షణ బాధ్యతను బీఎస్ఎఫ్‌కు అప్పగించినట్లు ప్రస్తావించారు. ఈ క్రమంలో బీఎస్ఎఫ్ ఆ బాధ్యతను అద్భుతంగా నిర్వర్తిస్తోందని అమిత్ షా అన్నారు. మీ సామర్థ్యంతో ఈ సరిహద్దులను గొప్పగా కాపాడారని షా కొనియాడారు. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం మరోసారి తన శక్తిని నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, ప్రధానమంత్రి మోదీ తగిన సమాధానం ఇస్తామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఆ వాగ్దానాన్ని నెరవేర్చినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత సైన్యం ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చిందన్నారు కేంద్రమంత్రి అమిత్ షా.

## 'ఈశాన్యం'లో అసాధారణ అభివృద్ధి

న్యూఢిల్లీ

ఈశాన్య రాష్ట్రాల్లో మునుపెన్నడూ లేని రీతిలో అసాధారణ అభివృద్ధి జరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. గతంలో బాంబులు, తుపాకులు, ఘర్షణలకు మారుపేరైన ఈ ప్రాంతం ఇప్పుడు ప్రగతి పథంలో దూసుకెళ్తోందని చెప్పారు. ఈశాన్యంలో అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో ప్రధాని మోదీ ప్రసంగించారు. వైవిధ్యమే ఈశాన్యానికి అతిపెద్ద బలమని తెలిపారు. ఇక్కడ పెట్టుబడులకు, వ్యాపారాభివృద్ధికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రధానంగా ఇంధనం, సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులకు ఈశాన్య రాష్ట్రాలు గమ్యస్థానంగా మారాయని వెల్లడించారు. దేశంలో సెమీకండక్టర్ల ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయడంలో అస్సాం పాత్ర గణనీయంగా పెరిగిందని ఉద్ఘాటించారు. నార్త్‌ఈస్ట్ సెమీకండక్టర్ ప్లాంట్ నుంచి అతిత్వరలో మొట్టమొదటి మేడ్ ఇన్ ఇండియా చిప్ రాబోతోందని ప్రకటించారు. ఈశాన్యానికి ఇదొక మైలురాయి కాబోతోందని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీని వినియోగించుకోవడంపాటు హైటెక్ పారిశ్రామిక ప్రగతిలో ఈశాన్య రాష్ట్రాల స్థానం మరింత పటిష్టం కానుందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదం, తీవ్రవాదంపై కఠిన వైఖరి ఏ ప్రాంతమైనా చక్కటి అభివృద్ధి సాధించాలంటే అక్కడ శాంతిభద్రతలు మెరుగ్గా ఉండడం అత్యంత కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అశాంతి, హింస కారణంగా గతంలో ఈశాన్య ప్రాంత యువకులు ఎన్నో అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఉగ్రవాదం, తీవ్రవాదంపై కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి అడ్డుగా నిలిచే హింసాకాండను సహించే ప్రసక్తే లేదన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, గత 11 ఏళ్లలో ఈశాన్యంలో 10 వేల మంది యువకులు ఆయుధాలు వదిలేసి అభివృద్ధిలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని తెలియజేశారు. వారంతా హింసను వ్యతిరేకిస్తూ శాంతి, సుస్థిరతను కోరుకుంటున్నారని ప్రశంసించారు.

**టూరిజం హబ్‌గా నార్త్ ఈస్ట్**

ఈశాన్య భారతదేశంలో హైడ్రోపవర్, సోలార్ పవర్ రంగాల్లో ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోందని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఇప్పటికే రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చామని చెప్పారు. ఈశాన్యంలో సోలార్ మాడ్యూల్స్, సెల్స్ తయారీ రంగంలోనూ ఎన్నెన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని పెట్టుబడిదారులకు పిలుపు నిచ్చారు. జీవ%-%ఆర్థిక వ్యవస్థ, వెదురు పరిశ్రమ, తేయాకు ఉత్పత్తి, పెట్రోలియం, క్రీడలు, నైపుణ్యాలకు ఈ ప్రాంతం పర్యాయపదంగా మారిందన్నారు. పర్యావరణ టూరిజానికి ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని చెప్పారు. రైజింగ్ నార్త్ ఈస్ట్ పెట్టుబ డిదారుల సదస్సులో ఈశాన్య రాష్ట్రాల ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులతోపాటు ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, అని ల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజులపాటు ఈ సదస్సు జరుగనుంది.

## 'మైసూర్'లో 'పాక్' మాయం!

జైపూర్

'మైసూర్‌పాక్‌లో మైసూర్ ఏదిరా?' అంటూ ఒక సినిమాలో హోటల్ యజమానిని కమెడియన్ పాత్రధారి నిలదీసే సీన్ కడుపుబ్బా నవ్విస్తుంది. జైపూర్లో మాత్రం పలు మిఠాయి దుకాణాలు మాత్రం దాయాది పేరు ధ్వనిస్తోందనే కారణంతో మైసూర్‌పాక్ పేరును మైసూర్‌శ్రీగా మార్చేశాయి! అంతేగాక ప్రతి మిఠాయి పేరులోనూ పాక్‌కు బదులు శ్రీ అని చేరుస్తున్నాయి. అలా మోతీపాక్ మోతీశ్రీ, ఆమ్‌పాక్ ఆమ్‌శ్రీ గోండ్ పాక్ గోండ్‌శ్రీ అయిపోయాయి. స్వర్ణభస్మపాక్, చాందీభస్మ్ పాక్ వంటి ప్రీమియం మిఠాయిలు కూడా స్వర్ణభస్మశ్రీ, చాందీభస్మ్ శ్రీగా పేరు మార్చుకున్నాయి. దేశాభిమానంతోనే ఈ పని చేసినట్టు జైపూర్లోని ప్రఖ్యాత 'త్యోహార్ స్వీట్స్', 'బాంబే మృష్టాన్ భండార' వంటి స్వీట్‌షాపుల యజమానులు చెబుతున్నారు. దీన్ని కస్టమర్లు కూడా ఎంతగానో మెచ్చుకుంటుండటం విశేషం! "స్వీట్ల పేర్ల మార్పు చిన్న విషయంగా అన్పించొచ్చు. కానీ పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యం నుంచి చూస్తే ఇది చాలా శక్తిమంతమైన సాంస్కృతిక సంస్పందన. యుద్ధక్షేత్రం నుంచి మిఠాయి దుకాణాల దాకా మన వీర జవాన్లకు ప్రతి భారతవాసీ తోడుగా ఉన్నాడని చాటిచెప్పే ప్రయత్నమిది" అని వారంటున్నారు. "మైసూర్‌పాక్ పేరును మైసూర్‌శ్రీగా మార్చారని వినగానే నా పెదాలపై గర్వంతో కూడిన చిరునవ్వు ఉదయించింది. మన జవాన్ల వీరత్వానికి మిఠాయిలు కూడా ఇలా సెల్యూట్ చేస్తున్నాయని అనిపించింది" అని పుష్పా కౌశిక్ అనే రిటైర్డ్ టీచర్ చెప్పుకొచ్చారు.

## కోటాలోనే విద్యార్థులు ఎందుకు చనిపోతున్నారు?

ఇంటర్నెట్ డెస్క్: రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కోటాలోనే ఇవి ఎందుకు చోటుచేసుకుం టున్నాయంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ ఏడాది ఇప్పటికే 14



మంది విద్యార్థులు బలవంతంగా ప్రాణాలు తీసుకోవడాన్ని తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారంటూ నిలదీసింది. కోటా, ఐఐటీ ఖరగ్‌పుర్‌లకు చెందిన ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యల కేసులను విచారించిన జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం.. ఎఫ్ఐఆర్ నమోదులో పోలీసుల వైఖరిని తప్పుపట్టింది. ఐఐటీ ఖరగ్‌పుర్‌కు చెందిన విద్యార్థి (22) ఆత్మహత్యకు సంబంధించిన కేసును సుప్రీం విచారించింది. మే 4న హాస్టల్ గదిలో ఉరివేసుకొని మరణించగా.. పోలీసులు మాత్రం మే 8న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదుకు నాలుగు రోజులు ఆలస్యం ఎందుకు అయ్యిందని సంబంధిత పోలీసు అధికారిని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ కేసులను తేలికగా తీసుకోవద్దని, చాలా తీవ్రత కలిగిన అంశాలని పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు సంబంధించి మార్చి 24న ఇచ్చిన తీర్పును ప్రస్తావించిన న్యాయస్థానం.. ఇటువంటి కేసుల్లో ఎఫ్ఐఆర్ త్వరగా నమోదుచేయడం ఎంతో ముఖ్యమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా పోలీసు అధికారి, ఐఐటీ ఖరగ్‌పుర్ తరఫు న్యాయవాది ఇచ్చిన వివరణలపై సుప్రీం ధర్మాసనం అసంతృప్తి వ్యక్తంచేసింది.

**పోక్సో చట్టం కింద దోషిగా తేలిన వ్యక్తికి ఏ శిక్షా వేయని సుప్రీంకోర్టు!**

కోటాలో నీట్‌కు సన్నద్ధమవుతోన్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకోగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని ధర్మాసనం తప్పుపట్టింది. గతంలో న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ధిక్కరిస్తున్నారని, ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని నిలదీసింది. సంబంధిత పోలీసు అధికారి విధి నిర్వహణలో విఫలమయ్యారని, కోర్టు ఆదేశాలను ఆయన పాటించలేదని పేర్కొంది. దీనిపై జులై 14 సదరు పోలీసు అధికారి హాజరై వివరణ ఇవ్వాలని సమన్లు జారీచేసింది. "రాష్ట్ర ప్రభుత్వంగా ఏం చేస్తున్నారు? కోటాలోనే విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? ఈ విషయంపై ఎందుకు ఆలోచించడం లేదు? అని రాజస్థాన్ ప్రభుత్వం తరఫు న్యాయవాదిని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు న్యాయవాది బదులిస్తూ.. ఆత్మహత్యల కేసులను పరిశీలించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

# రాజీలేని పోరాట యోధుడు



తెలంగాణ ప్రాంతం దశాబ్దాల కాలం నుండి ఉద్యమాలకు ఆలవాలం. నిరంకుశ వాదంపై అలుపెరుగని పోరాటం చేసిన కార్యస్థలం. నిజాం రాచరిక పాలన సాగుతున్న ఆ రోజుల్లో ప్రజలు బానిసలుగా బతికేవారు. నరకం చూసేవారు. ఖాసీం రజ్వీ అనుచరుల అకృత్యాలకు అడ్డూ అదుపూ లేకుండా ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ కరువైన దుస్థితి. తెలంగాణ పల్లెల్లో ఒకవైపు భూస్వాములు, రజాకార్ల ఆకృత్యాలపై సాయుధ దళాలు దాడులకు దిగుతుంటే.. మరోవైపు సింగరేణి బొగ్గు గనుల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులు కార్మికుల్లో చైతన్యాన్ని కలిగించాయి. ఈ ప్రాంతంలోని దేవులపల్లి శేషగిరి రావు అనే వ్యక్తి ఇల్లందు, కొత్తగూడెం కేంద్రాలుగా బొగ్గు గని కార్మికుల్లో పోరాట చైతన్యాన్ని నింపారు. నిజాం కాలంలోనే కార్మికులను రహస్యంగా సంఘటిత పరిచి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ను స్థాపించారు. భూస్వాములు, పోలీసుల దాడులను తిప్పికొట్టేందుకు శేషగిరిరావు సాయుధ దళానికి నాయకత్వం వహించారు. సాయుధ దళంతో భద్రాచలం ఏరియాలోని నెల్లిపాక అడవుల మీదుగా మణుగూరు వెళ్తున్న క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో శేషగిరి దళం నామ రూపాలు లేకుండా పోయింది. ఉద్యమ కారుడు శేషగిరిరావు కాల్చి చంప బడినపుడు శేషగిరి రావు పేరులోని గిరిని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని మ్ముందుకు నడిపాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం పల్లెలకు పరిమితం కాలేదు. బొగ్గు గనుల్లో దుర్భర జీవితాలు అనుభవిస్తున్న కార్మికులు కూడా ఉద్యమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా నిజాంకు ముఖ్య అనుచరుడిగా ఉన్న ఖాసీం రజ్వి అనుచరుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మడిమ తిప్పని పోరాటాలు కొనసాగించారు. గార్ల, బయ్యారం, ఇల్లందు ప్రాంతాల్లో నిజాంకు వ్యతిరేకంగా ఉద్యమాలు జరిగాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఈ ప్రాంతం మధిర నియోజకవర్గం పరిధిలోకి వచ్చేది. అప్పట్లో మధిర వరంగల్ జిల్లాలో భాగస్వామ్యంగా ఉండేది. మధిర నియోజకవర్గం లోని ప్రతి ఊరు ఆనాటి నిజాం కు వ్యతిరేకంగా పోరాడింది. ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలో బ్రిటిష్ ప్రభుత్వం ఉండడంతో అక్కడి పోరాట ప్రభావం మధిరపై కనిపించేది. ఫలితంగా కమ్యూనిస్టులు ఇక్కడ ఆంధ్ర మహాసభ పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారు. మధిర లోని అల్లినగరంలో ప్రారంభమైన ఉద్యమం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాంది అని చరిత్రకారుల భావన. కమ్యూనిస్టు పార్టీ నేతలు నల్లమల గిరిప్రసాద్, బొమ్మకంటి సూర్యనారాయణ, మల్లు స్వరాజ్యం ఆధ్వర్యంలో ఆనాడు క్యాంపులు నిర్వహించారు. అలా ఆనాటి ప్రజా ఉద్యమాలతో విడదీయ జాలని సంబంధం, అనుబంధం కలిగి ఉన్నాడు నల్లమల గిరి ప్రసాద్. ఖమ్మం శాసనసభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ గా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షుడిగా, భారత కమ్యూనిస్టు పార్టీ అఖిల భారత డిప్యూటీ జనరల్ సెక్రటరీగా, తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా పేరెన్నిక గన్న భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం మచ్చలేని మహా నాయకుడు నల్లమల గిరిప్రసాద్. ఖమ్మం జిల్లా, మధిర మండలం, తొండల గోపవరం గ్రామంలో ఏప్రిల్ 6, 1931లో నల్లమల ప్రసాద్ జన్మించాడు. మద్రాస్ కళాశాలలో చదివే సమయంలో ఆంధ్రా మహాసభ కార్యకలాపాల పట్ల ఆకర్శితులయ్యాడు. 1947లో చదువుకు స్వస్తిచెప్పి ఆంధ్రా మహాసభలో, తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరాడు. నిజాం రాక్షస రజాకారుల మూకలు గ్రామాలపై పడి బీభత్సకాండ జరుపుతుండగా ప్రజలు తిరబడి సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో తుపాకి చేతబట్టి సాయుధుడయ్యాడు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు శేషగిరిరావును కాల్చి చంప బడినపుడు "శేషగిరి రావు" పేరులోని "గిరి"ని తన పేరు ముందుంచుకుని నల్లమల ప్రసాద్, నల్లమల గిరిప్రసాద్‌గా మారి గిరి దళాన్ని నడిపాడు. సాయుధ పోరాటం అనంతరం ఐదు సంవత్సరాల అజ్ఞాత జీవితం గడిపాడు. 1953లో అప్పటి ప్రభుత్వం గిరిప్రసాద్‌పై అనేక కేసులు నమోదుచేసి జైలుకు పంపగా, ఆ కేసులలో ఏదీ రుజువు కాలేదు. గిరి ప్రసాద్ 1953లో ఉద్యమ కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికై 11 సంవత్సరాల పాటు కొన సాగాడు. 1962లో ఖమ్మం నుండి శాసన సభ్యునిగా ఎన్నికయ్యాడు. కమ్యూనిస్టు పార్టీ చీలిక సమయంలో సిపిఐ బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు విశేష కృషి చేశాడు. 1978లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై 1991 వరకు పని చేశాడు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షునిగా, 1992నుంచి రాజ్యసభ సభ్యుడుగా పనిచేశాడు. 1992లో సి.పి.ఐ. జాతీయ కార్యదర్శిగా, 1996లో ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. స్వాతంత్ర్య సమరయోధుల స్క్రీనింగ్‌కమిటీ చైర్మన్‌గా పనిచేశాడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడిన నల్లమల గిరిప్రసాద్ 1997, మే 24 న ఈ లోకాన్ని వదిలి వెళ్ళాడు.

# అలంకారప్రాయంగా కామన్వెల్త్



కామన్వెల్త్ అనేది.. ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లు లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్... ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ యొక్క అవసరం ఏర్పడింది. కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాధనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశ పెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా 'ఎంపైర్ డే ' ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884లో, లార్డ్ రోజ్‌బెరీ అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని "కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్" గా అభివర్ణించాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థ అవసరమైంది. 1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్ లో తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్షేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే ' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన ' మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అద్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901 లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' నిర్వహించాలని నిర్ణయించారు. అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది. 1931 లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో... ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించ బడింది. 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడగా, . 1949లో ఆ పేరు నుండి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలసరాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది. ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది. కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలో లేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావు భాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి. విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్ ప్రజలు ఉన్నారు. 2024లో, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ఇది 8.1 బిలియన్లకు చేరుకుందని పేర్కొంది, ప్రపంచ జానాభాలో మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే. ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతిపెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే. 2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరవాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించుకున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యా రంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేక రంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందుకోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్ల కోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేక పోలేదు

## దైవిక పాత్రలకు జీవంపోసిన నటుడు

టి.ఎస్. విజయ చందర్ తెలుగు నాటక, సినిమా, టెలివిజన్ రంగాల్లో విశిష్టతను సంపాదించుకున్న గొప్ప కళాకారుడు. నటుడు, దర్శకుడు, నిర్మాతగా ఆయన ప్రస్థానం ప్రతి దశలోను విలక్షణతను చాటింది. 1939 మే 24న ఆంధ్ర ప్రదేశ్‌లో జన్మించిన ఆయన, చిన్ననాటి నుంచే కళలకు ఆసక్తితో ఎదిగారు. కుటుంబ నేపథ్యం కూడా ఆయనకు స్ఫూర్తి దాయకమే. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఈయనకు తాత అవుతారు. విజయచందర్ తల్లి పుష్పావతి, ప్రకాశం పంతులు కూతురు. తండ్రి తెలిదేవర వెంకట్రావు హోమియోపతి వైద్యుడు. బ్యాడ్మింటన్ ఛాంపియన్ కూడా. అంతేగాక ప్రసిద్ధ గాయని టంగుటూరి సూర్యకుమారి కూడా ఆయనకు సమీప బంధువు. విజయచందర్ సినీ రంగంలోకి అడుగుపెట్టిన చిత్రం 'సుడి గుండాలు (1967), అదే సంవత్సరానికి ఉత్తమ తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డు అందుకుంది. నటుడిగా మాత్రమే కాక, ఒక ఆలోచనాత్మక కళాకారుడిగా ఆయన చూపిన ప్రావీణ్యం తర్వాతి చిత్రాలలో స్పష్టంగా కనపడింది. 1978లో నిర్మించిన 'కరుణా మయుడు' చిత్రం ద్వారా ఆయనను తెలుగు ప్రేక్షకులు పూర్తిగా గుర్తించారు. యేసు క్రీస్తు పాత్రలో ఆయన హృద్య నటన, ఆత్మీయమైన భాష్యం ప్రేక్షకులను ఆధ్యాత్మికంగా ప్రభావితం చేసింది. ఈ చిత్రాన్ని ఆయన నిర్మాతగా నిర్మించారు. అది తెలుగుతోపాటు తమిళం, మలయాళంలో కూడా విడుదలై విజయవంతమైంది. ఆయన ప్రతిభను, పూర్వీకుల జీవితాల రూపకల్పన లో మనం గమనించ వచ్చు. 1982లో విడుదలైన 'ఆంధ్ర కేసరి' చిత్రంలో ఆయన టంగుటూరి ప్రకాశం పంతులు పాత్రను పోషించడం మామూలు విషయం కాదు. ఆ పాత్రకు ఆయన కలిగిన వ్యక్తిగత అనుబంధం, పరిశోధనాత్మకత, నటనలోని గంభీరత చిత్రాన్ని చారిత్రకంగా నిలిపాయి. ఈ చిత్రానికి రచయిత, దర్శకుడు, నిర్మాతగా కూడా ఆయన సేవలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూపొందిన ఈ చిత్రం ప్రత్యేక జ్యూరీ పురస్కారం అందుకుంది. 1986లో వచ్చిన 'శ్రీ షిర్డీ సాయిబాబా మహత్యం' చిత్రంలో ఆయన పోషించిన సాయిబాబా పాత్ర అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించబడిన స్థాయికి చేరింది. ఆయన నటన భక్తిని రేకెత్తించేలా ఉండి, ప్రేక్షకులను ఆధ్యాత్మిక భావనల్లో తేలి యాడించింది. ఆయనకు "దైవిక పాత్రల పోషణలో నిపుణుడు" అనే పేరు ఈ చిత్రాల వల్లే వచ్చినదని చెప్పవచ్చు.

# గ్రీన్‌గ్యాస్‌కు గ్లోబల్ ట్యాక్స్

గ్లోబల్ వార్మింగ్ కట్టడికోసం గ్రీన్‌హౌస్ ఉద్గారాల (హరిత వాయువుల వెల్లువ)పై గ్లోబల్ ట్యాక్స్ విధించడానికి షిప్పింగ్ వనరుగా ఉన్న ప్రధాన దేశాలు అంగీకారం తెలిపాయి. దీని ప్రకారం నౌకలు విడుదల చేసే ప్రతి టన్ను కార్బన్ డైయాక్సైడ్‌పై ఇకనుంచి కనీసం 100 డాలర్ల వంతున పన్ను విధించనున్నాయి. ఆయా దేశాల నౌకలు లక్షాలను చేరలేకపోయినా, ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ నెట్ జీరో ఫండ్‌కు నిధులు అందించకున్నా 2028 నుంచి ఈ ట్యాక్స్‌ను వసూలు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 11న లండన్‌లో 60కి పైగా దేశాల ప్రతినిధులతో ఇంటర్నేషనల్ మారిటైం ఆర్గనైజేషన్ (ఐఎంఒ) సమావేశం జరిగింది. అయితే అగ్రరాజ్యం అమెరికా మాత్రం దీనికి గైర్హాజరు కావడం గమనార్హం. ఓడల్లో వాడే ఇంధనానికి సైతం ఈ సమావేశం పలు ప్రమాణాలను నిర్దేశించింది. మొత్తం ఉద్గారాల్లో షిప్పింగ్ వాటా 3 శాతమని ఐక్యరాజ్యసమితి గణాంకాలు చెబుతున్నాయి. ఓడల సంఖ్యతోపాటు వాటి పరిమాణం పెరుగుతుండడం, అందుకు అనుగుణంగా ఇంధనవాడకం విపరీతంగా పెరిగిపోతుండటంతో రానున్న రోజుల్లో షిప్పింగ్ ఉద్గారాలు ఇంకా ఎక్కువవుతాయని భావిస్తున్నారు. ఐఎంఒ భేటీలో కుదిరిన ఒప్పందంపై సెక్రటరీ జనరల్ ఆర్సెనియో డొమింగెజ్ హర్షం వెలిబుచ్చారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి షిప్పింగ్ ఆధునికీకరణకు ఎన్నో సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటూ ఈ బృందం అర్థవంతమైన ఏకాభిప్రాయాన్ని సాధించిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ వాణిజ్యానికి సముద్ర నౌకా రవాణా అన్నది వెన్నుముక వంటిది. ఏటా సుమారు 12 బిలియన్ టన్నుల సరకు నౌకలపై రవాణా అవుతుందని యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ (యుఎన్‌సిటిఎడి) 2023 నివేదిక వెల్లడిస్తోంది. 2022లో సముద్ర వాణిజ్యం 0.4 శాతం తగ్గినా, కంటైనర్ల ద్వారా రవాణా (2024 నుంచి కంటైనర్ల రవాణా ఏటా 3% పెరుగుతోంది) చమురు, గ్యాస్ రవాణా 2022 నుంచి క్రమంగా 6%, 4.6 శాతం పెరుగుతుండడంతో 2028 నాటికి మొత్తం సముద్ర వాణిజ్యం 2.1% నుంచి 2.2% వరకు పెరుగుతుందని అంచనా. ఈ విధమైన పెరుగుదల ఇంధన వాడకానికి మరింత ఆజ్యం పోస్తుంది. గత దశాబ్దకాలంగా షిప్పింగ్ ఉద్గారాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏటా విడుదలయ్యే ఒక బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్‌డైయాక్సైడ్ ఉద్గారాలు, 3% గ్లోబల్ గ్రీన్‌హౌస్ గ్యాస్‌తో సమానం. భారీ నౌకలు ప్రతి ట్రిప్పుకు ఎక్కువ సరకును రవాణా చేస్తుంటాయి. భారీ మొత్తంలో ఇంధనాన్ని మండిస్తుంటాయి. పనామా, లిబేరియా, మార్షల్ దీవుల్లో ఇదే పరిస్థితి. ప్రపంచం మొత్తం మీద రవాణా అయ్యే టన్నుల సరకుల్లో మూడోవంతు ఈ రేవుల ద్వారానే జరుగుతుంది. అంతే సమానంగా ఉద్గారాలు విడుదల అవుతుంటాయి. ఇంటర్నేషనల్ మారటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఒ) 2023 సవరించిన గ్రీన్‌హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి)వ్యూహం (స్ట్రాటెజీ) ఆశించే లక్షాలను నిర్దేశించింది. 2008 నాటి ఉద్గారాలస్థాయిలను ప్రామాణికంగా తీసుకుని 2030 నాటికి 20% నుంచి 30% వరకు ఉద్గారాలు తగ్గించాలని, 2050 నాటికి జీరో స్థాయికి చేరుకోవాలని నిర్దేశించింది. అయినపప్పటికీ, ఎలాంటి చొరవ తీసుకోకుంటే ఉద్గారాలు మరింత ఎక్కువగా పెరుగుతాయని అంచనా వేశారు. యునైటెడ్ నేషన్స్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ గుర్తించడం బట్టి భౌగోళిక రాజకీయ మార్పులు, ఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాలు, మళ్లీ చమురు, ఆహార ధాన్యాల నౌకల రవాణా టన్నుల భారం కన్నా మరింత దూరం సాగేలా చేస్తున్నాయి. 2023లో చమురు రవాణా దూరంతోపాటు సుదీర్ఘకాలం సాగింది. ఐఎంఒ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ కమిటీ నిర్ణయించిన గ్లోబల్ కార్బన్ టాక్స్ మేరకు ఆయా లక్షాల నౌకలు నెట్ జీరో నిధులను అందించడం కానీ, లేదా ఉద్గారాల నియంత్రణ కానీ చేయలేకపోతున్నాయని వ్యాఖ్యానించింది. ఇది వాడుతున్న ఇంధన ప్రమాణాల బట్టి ఆధారపడి ఉంది. ఉద్గారాలను పూర్తిగా, లేదా కొంత స్థాయివరకు తగ్గించడానికి దోహదపడే హైడ్రోజన్, మెథనాల్, అమెనియా వంటి వాటిని ప్రోత్సహించడం అవసరం. ప్రకృతికి విరుద్ధమైన మానవ కార్యకలాపాల వల్ల భూమి వేడెక్కిపోతూనే ఉంది. 1850లో భూ ఉష్ణోగ్రతను నమోదు చేయడం మొదలైనప్పటి నుంచి అత్యుష్ణ సంవత్సరంగా 2023 రికార్డు సృష్టించగా, వెంటనే 2024 ఆ రికార్డును బద్దలు కొట్టింది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్లూఎంఒ) గత జనవరిలో ఈమేరకు ఓ నివేదిక విడుదల చేసింది. అసలు గడచిన పదేళ్లు భూమిపై గత 125000 ఏళ్లలోనే అత్యుష్ణ సంవత్సరాలని ఐరోపా, బ్రిటన్, జపాన్ దేశాల వాతావరణ సంస్థలు నిర్ధారించాయి. బొగ్గు, చమురు ఆధారిత పారిశ్రామిక విప్లవం వచ్చినప్పటి నుంచి భూ ఉష్ణోగ్రత పెరుగుతూ వస్తోంది. ఈ పెరుగుదల 1.5 సెల్సియస్ డిగ్రీలకు (2.7 ఫారన్ హీట్) మించకుండా చూడాలని 2015లో పారిస్ వాతావరణ సభ తీర్మానించింది. కానీ ఈ ఏడాది భూ ఉష్ణోగ్రత ఆ పరిమితిని మించి 1.6 సెల్సియస్ డిగ్రీలకు పెరిగిందని ఐరోపా కమిషన్‌కు చెందిన కొపెర్నికస్ వాతావరణ విభాగం తెలిపింది. జపాన్ ఈ పెరుగుదలను 1.57 డిగ్రీలుగా, బ్రిటన్ 1.53 డిగ్రీలుగా లెక్కగట్టాయి. వాతావరణ మార్పుల వల్ల వరదలు, తుపానులు, అనావృష్టి తలెత్తి గత ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 14,000 కోట్ల డాలర్ల నష్టం జరిగింది. శిలాజ ఇంధనాలైన బొగ్గు, చమురు, సహజ వాయువులను మండించడం వల్లనే వాతావరణంలో కర్బనం పెరిగి ఉష్ణోగ్రతను పెంచుతోంది. పారిశ్రామిక విప్లవంనుంచి సంపన్న ఐరోపా, అమెరికా ఖండ దేశాలు శిలాజ ఇంధనాలను మండించడం ద్వారా ప్రపంచానికి 170 లక్షల కోట్ల డాలర్ల నష్టం కలిగించాయి. ఈ నష్టాలను అధిగమించడానికి వర్ధమాన దేశాలకు లక్షల కోట్ల డాలర్ల సహాయం చేయాల్సిన సంపన్న దేశాలు కేవలం 30,000 కోట్ల డాలర్లను అదీ 2035 కల్లా విదిలిస్తామని ప్రతిపాదించాయి. భూగోళం వేడెక్కడ మనేది కఠోరమైన వాస్తవమని డబ్లుఎంఒ తాజా నివేదిక మరోసారి రుజువు చేస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ వ్యాఖ్యానించారు. భూతాపం పెరగడం మాతాశిశు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తోంది. వేడి ఎక్కువగా ఉండే రోజుల సంఖ్య పెరుగుతున్నందున నెలలు నిండక ముందే శిశు జననాలు సంభవిస్తున్నాయి. తల్లులకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. 202024 మధ్య కాలంలో 247 దేశాలు, 940 నగరాల్లో అధిక వేడిరోజులు రెట్టింపు అయ్యాయని తేల్చారు. గడిచిన అయిదేళ్లలో భారత్‌లో గర్భిణులకు ప్రమాదకరమైన రీతిలో జాతీయ స్థాయిలో ఏటా సగటున ఆరు అదనపు అత్యుష్ణ రోజులు నమోదైనట్టు నివేదికలు చెబుతున్నాయి.

# కాషాయపు కండువా ముసుగులో నరమేధం సృష్టిస్తున్న నరేంద్ర మోడీ అమిత్ షా వీళ్ళ ఆధ్వర్యంలో కగార్ ఆపరేషన్ ఎవరికోసం?

**బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మునుగోడు నియోజకవర్గ నాయకులు.. రాచకొండ గిరి**



**సంస్థాన్ నారాయణపూర్,సూర్య ప్రతినిధి:** పహాల్గామ్ దాడిలో 20 మంది పైగా మృతి చెందిన అమాయకులను కాల్చి చంపిన టెర్రరిస్టులని పట్టుకోలేని భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం ఖగార్ ఆపరేషన్ పేరిట ఈ దేశ స్థానికులైన ఆదివాసీలపై నరమేధం సృష్టిస్తుంది.ఈ దేశంలో పుట్టి ఈ దేశ ప్రజల కోసం ఎస్సీ ఎస్టీ, బీసీ మైనారిటీ ప్రజలందరికీ ఈ దేశంలోని ప్రకృతి వనరులు అందరికీ సమానంగా దక్కాలనీ ఈ దేశంలోని జల్ జంగల్ జమీన్ లపై అందరికి సమానమైన వాట దక్కాలనీ ఈ దేశవాసులుగా ఈ భూమి పుత్రులుగా గత కొన్ని దశాబ్దాల నుండి పీడిత ప్రజల తరపున పోరాటం చేస్తున్నారు. ఈదేశ ప్రజలకు ఉన్నత చదువులు చదవాలనీ వాళ్ళు గన్ను పడితే తప్ప పెన్ను మన జేబులోకి రాని పరిస్థితి నెలకొని ఉంది దాని ఈ దేశ పీడిత ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మన దేశ పీడిత ప్రజల తరుపున పోరాడే వాళ్ళని చంపి నరమేధం సృష్టించి మేము ఏదో గొప్ప సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నది భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వం. ఎదో సాధించామని చెప్పుకొనే కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పాహల్గామా దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను ఇంతవరకు పట్టుకోవడం సాద్యం కాలేదు గానీ ఈ దేశ వాసులైన,ఈ భూమి పుత్రులైన మావోయిస్టులను చంపుకుంటూ ఏదో సాధించినట్టు,శత్రువు దేశాలపై విజయం సాధించిందినట్టు కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం విర్ర వీగుతుంది.మావోయిస్టులు ఒకపక్క శాంతి చర్చలకు మేము సిద్ధంగా ఉన్నాము అంటుంటే మేధావి వర్గాలు సానుకూలంగా స్పందిస్తుంటే కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అవినీతి ప్రభుత్వం అవేవీ పట్టించుకోకుండా దండకారణ్యంలోని ఖనిజ సంపదను దోచి బడ చోర్ల చేతిలో అప్పజెప్పే ఆలోచన ఈ దేశంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తుంది.అంబానీ ఆధానీలకు వత్తాసు పలికే కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి దండకారణ్యంలో అనాదిగా నివసిస్తున్న ప్రజల పరిస్థితుల గురించి, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి కేంద్ర ప్రభుత్వానికి ఏమి తెలుస్తుంది.నార్త్ రాష్ట్రాలలో లో పుట్టి సౌత్ రాష్ట్రాల గురించి తెలుసుకోవాలంటే కొన్ని జన్మలు కావాలి వాళ్ళకి. మనం పడ్డ బాధలు నార్త్ లో ఎవడు పడడు ఎందుకంటే వానికి బాధ అంటే తెలవదు వాళ్ళు చదువుకోనీ మూరు?లు.రాజ్యాన్ని అడ్డుపెట్టుకొని ఎంతమందిని చంపుతరు.ఇలా ఈ రోజు మీ టైం నడుస్తుంది చంపుతారు కానీ రేపు వేరే వాళ్ళ టైం వస్తుంది వాళ్లు మిమ్మల్ని అదే పని చేస్తే దాని మనం ప్రజాస్వామ్యం అందామా.ప్రజాస్వామ్యం దేశ పౌరులను చంపడమేనా , ప్రజాస్వామ్యం దేశంలోని ప్రతి ఒక్క మనిషి ప్రాణాలకు విలువ ఉంటుందని చెప్పడమా.చంపబడుతున్న నక్సలైట్లు ఈ భూమి పుత్రులు కాదా,ఈ దేశ పౌరులు కాదా మన ఊర్లో పుట్టలేదా మన ఊర్లో తిరగలేదా ఎంతమందినీ ఇలా చంపుతరు.ప్రతి ఒక ఇంట్లో ఒకడు తిరగబడతారు ఎందుకంటే కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ చేసే పాలన అసభ్యకరంగా ఉంది. ఉన్నత వర్గాలకే అన్ని దక్కుతున్నాయి లేని వారిని ఆదుకునే నాధుడే లేడు. ప్రజా జీవితంలో ప్రజాస్వామ్యంలో ఏదో రూపంలో సమస్యలు ఉన్నంతకాలం పోరాటాలు చేసే ప్రజలు పుట్టుకొస్తూనే ఉంటారు. ఇకనైనా ఈ నరమేధాన్ని ఆపి దేశంలోని శాంతిని కోరే మేధావుల మాట విని మావోయిస్టులతో చర్చలు జరపాలని దేశంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.దండకారణ్యంలో నిర్వహిస్తున్న ఖగార్ ఆపరేషన్ ను విరమించుకోవాలని ప్రతి సామాన్యుని గుండెల్లో పలుకుతున్న ఆవేదన. ఖగార్ ఆపరేషన్ ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం మునుగోడు నియోజకవర్గ నాయకులు

రాచకొండ గిరి

# మోడీ పాలనలో పెట్టుబడిదారులకు రాయితీలు, పేదలకు భారాలు





**ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఈ నెల 30న కలెక్టరేట్ ముందు ధర్నాను జయప్రదం చేయండి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ**



**ఆలేరు, సూర్య ప్రతినిధి :** కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వము అధికారం చేపట్టిన నాటి నుండి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు రాయితీలు కలిపిస్తూ పేదలకు మాత్రం బారాలు మోపుతున్నారని గ్రామీణ పేదలకు బువ్వ పెడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని కూడా ఎత్తివేయాలని కుట్రలు చేస్తున్నారని ఈ కుట్రలకు వ్యతిరేకంగా ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆలేరు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొల్లనకొండ గ్రామంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి కార్మిక సమస్యలను తెలుసుకొని అనంతరం వారి ఉద్దేశించి నర్సింహ మాట్లాడుతూ మోడీ 11 సంవత్సరాల పాలనలో ప్రజలపైన భారాలు మోపడం తప్ప వారికి చేసింది ఏమీ లేదని విమర్శించారు. దేశవ్యాప్త పోరాట ఫలితం 2005లో వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి అనేక రకాలైన కొర్రీలు పెడుతూ కొత్త కొత్త జీవోలు తీసుకొచ్చి చట్టాన్ని ఎత్తివేయాలనే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కూలీలకు రోజు కూలీ 600 ఇవ్వమంటే 307 రూపాయలు నిర్ణయించ 150 వందల నుంచి 200 రూపాయలు ఇవ్వడం ఏమిటి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 6 కోట్ల పని దినాలు అవసరం ఉంటే 3 కోట్ల పని దినాలను కల్పించడమేమిటి అని కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని నర్సింహ ప్రశ్నించారు. చట్టంలో కార్మికులు తాగడానికి నీళ్లు, నీడ కోసం టెంటు, మెడికల్ కిట్టు లాంటి మౌలిక సౌకర్యాలు ఉంటే వాటిని అమలు చేయడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న వేతనాలు విడుదల చేసి కొత్త జాబ్ కార్డులు ఇచ్చి నూతన పనిముట్లు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్ వేతనాలు ఇచ్చి పర్మినెంట్ చేసి జీతాలు పెంచాలని, ప్రమాదంలో గాయపడిన కార్మికులకు ఉచిత వైద్యం అందించాలని, చనిపోతే 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, సంవత్సరానికి 200 వందల రోజుల పని దినాలు కల్పించి రోజు కూలీ 600 ఇవ్వాలని కోరారు. వీటి సాధన కోసం 30వ తేదీన నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు వందలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్, మండల అధ్యక్షులు బొమ్మకంటి లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు మధ్య పురం ఉప్పలయ్య ఫీల్డ్ అసిస్టెంట్ గంధమల్ల రామచంద్రం, ఉపాధి హామీ కార్మికులు సందపెల్లి అండాలు, ఆనందం, గుర్రం లావణ్య, గంధమల్ల మహేశ్వరి, మౌనిక, బాకీ మమత, బోడ యాదగిరి, బలంతుల చంద్రయ్య, కల్యారి సుజాత, కాస ఎల్లమ్మ, గంధమల్ల ఆదాం, కవిత, బొవనగిరి కుమార్, కళ్యాణి, బోడ అంజయ్య, లక్ష్మి, బాకీ ప్రేమలత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# నాడు రజకులను ఎస్సీలో చేర్చాలని అసెంబ్లీలో మాట్లాడిన నేటి సీఎం నెరవేర్చాలి : గోపి రజక

**అధునాతన ధోభీఘాట్ , మినీ పంక్షన్ హాల్,ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలి ? సి హెచ్. రవీందర్**



**కోడంగల్, సూర్య ప్రతినిధి:** కోడంగల్ నియోజకవర్గ కేంద్రంలో రజకుల సంక్షేమం కోసం 2 ఎకరాల భూమి కేటాయించి అధునాతన ధోభీఘాట్ , మినీ పంక్షన్ హాల్, సంత్ గాడ్గే బాబా ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షులు సి హెచ్, రవీందర్ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని కోరారు. వికారాబాద్ జిల్లా కోడంగల్ మండల కేంద్రములో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సి హెచ్. రవీందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా నాయకుల సమావేశానికి కులగురువు పరమపూజ్య శ్రీ డాక్టర్ శ్రీనివాస స్వామిజీ,రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక హాజరై మాట్లాడుతూ గతంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో నేటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను సాకారం చేయాలని ఆదిశగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. దేశంలో 18 రాష్ట్రాలలో ఎస్సీ లుగా కొనసాగుతూ ఆర్థిక రాజకీయ సామాజికంగా అభివృద్ధి పథంలో ఉన్నారని కానీ మిగతా 11 రాష్ట్రాల్లోని రజకులు ఓబీసీ లుగా ఉండుటచే అన్ని రంగాల్లో వెనుకబడినారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే మొదటిసారిగా బీసీల కుల గణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచిన ధీశాలి ఏనుముల రేవంత్ రెడ్డి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి మిగతా రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శం కావాలని అదేవిధంగా మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కలలను సాకారం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు సి హెచ్. రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి కోడంగల్ నియోజకవర్గంలోని రజకులు సంక్షేమ పథకాలకు ఆమడదూరంలో ఉన్నారని కనీసం ఇప్పటికయినా సీఎం నియోజకవర్గం కావడంతో గంపెడాశతో రజకుల కళ్లలో ఒత్తులు వేసుకుని సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ప్రతి వృత్తిదారునికి 2 లక్షల బ్యాంకు రుణాలు ఇవ్వాలని, ఇండ్లు లేని నిరుపేదలకు గూడు కట్టించాలని, నిజమైన లబ్ధిదారులకు పింఛన్ కల్పించాలని , నిరుద్యోగ రజక యువతకు హాస్పిటల్లో హాస్టల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లో ధోభీ పోస్టులు కేటాయించాలి ,వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షులు సి.అనిల్, జిల్లా ఉపాధ్యక్షులు సి.బాలప్ప,జిల్లా సంయుక్త కార్యదర్శి సి.వెంకటప్ప, సీనియర్ నాయకులు సుందరప్ప,బిచ్చాల్ మొగులయ్య,శ్యామప్ప, నవీన్, బీమప్ప, వెంకట్,ఆజిపూర్ పకిరప్ప, సతీష్ పాల్గొన్నారు

# మే 31 న టీజేఎఫ్ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవాలు జయప్రదం చెయండి

**టి యూ డబ్ల్యూజే కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్**



**మల్కాజ్ గిరి, సూర్య ప్రతినిధి:** మే 31న టి జె ఎఫ్ నిర్వహించే రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని టి యు డబ్ల్యూ జే రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ పిలుపునిచ్చారు.శుక్రవారం నేరెడ్ మెట్ చౌరస్తా లోని తేజ ఇన్ఫ్రా డెవలప్మెంట్ కార్యాలయంలో టీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే రజితోత్సవ వేడుకల గోడపత్రిక ను జిల్లా బాద్యులు అమర్, మల్కాజిగిరి సర్కిల్ గౌరవ అధ్యక్షులు బద్దుల మురళీకృష్ణ యాదవ్, అధ్యక్షుడు జార్జ్ విల్సన్ ప్రధాన కార్యదర్శి గిరి గౌడ్ లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం నిర్వహించిన చారిత్రాత్మక పాత్రను తెలియజేయడం కోసం మే 31 న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.2001 మే 31న ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ తెలంగాణ రాష్ట్రం సాధించేంత వరకు, 2014 దాకా ఎన్నో సందర్భాల్లో క్రియాశీలక పాత్ర పోషించిందని ముత్తయ్య గౌడ్ తెలిపారు. వివిధ ప్రజా సంఘాలను, రాజకీయ పార్టీలను, విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చి తెలంగాణ ఉద్యమంలో టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించింది అన్నారు. మాక్ అసెంబ్లీ, ఛలో ఢిల్లీ, సాగర హారం, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలను చేసిన ఘనత జర్నలిస్ట్ ఫోరందని అన్నారు. ఉద్యమం చల్లబడ్డప్పుడల్లా టీజే ఎఫ్ కీలకపాత్ర పోషించి ఉద్యమాన్ని ముందుకు నడిపింది అల్లం నారాయణ అని గుర్తు చేశారు. ఇలాంటి ఎన్నో విషయాలను సమాజానికి మరోసారి తెలియజెప్పడానికి హైదరాబాద్ నెక్ల్ స్ రోడ్డు లోని జలవిహార్ లో ఈ నెల 31న టీజే ఎఫ్ రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ చేసిన ఉద్యమం మిగతా ఉద్యమాలకు ఒక దిక్సూచి లాంటిదని అన్నారు. ఈ కార్యక్రమం లో మల్కాజ్గిరి టియుడబ్ల్యూజే నాయకులు అక్కల రాజేందర్ గౌడ్, దూశెట్టి పాండు గౌడ్, వెంకట రమణ నాయుడు మనోజ్ గౌడ్, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

**మంజుల పత్తిపాటి.**



**ఆలేరు, సూర్య ప్రతినిధి:** లారీల కొరత,గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రైతులు వేడుకొన్నప్పటికి ...రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ అధికారుల తీరు ఏ మాత్రం మారడం లేదు. నాయకులు వచ్చినప్పుడు చేసిన హడావుడి తరువాత ఉండడం లేదు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్నీ సంచుల కొరత వల్ల వడ్ల కుప్పలు కల్లాల్లోనే ఉన్నాయని, వర్షానికి తడిసిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న పట్టించుకోకపోవడం చాలా బాధాకరం.
పలనా ఏరియా అని చెప్పడం లేదు కొన్నిచోట్ల అలా జరగడం బాధాకరం దయచేసి సత్వర చర్యలు చేపట్టాలని రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఒక రైతుగా అభ్యర్థన చేస్తున్నా.
మంజుల పత్తిపాటి.

## తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-82 జెండా ఆవిష్కరణ



**మహేశ్వరం, మే 23 (సూర్య ప్రతినిధి):** తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-82 నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు షౌకత్ పాషా, సాయిలు ముఖ్య అతిథులుగా హాజరై, సరోర్‌నగర్ సర్కిల్ పరిధిలోని చంపాపేట్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం డివిజన్లలో నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెండా ఆవిష్కరణ ఒక గుర్తింపు కంటే ఎక్కువ. ఇది ఉద్యోగుల ఐక్యత, హక్కుల కోసం పోరాటానికి సంకేతం. కార్మికులు ఐక్యతతో ఉండి, తమ హక్కులను సాధించుకోవాలి. మా యూనియన్ ఉద్యోగుల పక్షంలో ఎల్లప్పుడూ నిలబడి, వారి సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తుంది, అని చెప్పారు. కార్యక్రమంలో ఉపేందర్, శ్రీకాంత్ రెడ్డి, కంపెనీ నాయకులు బాల్ రెడ్డి, కావలి వెంకటేష్, పెద్దయ్య, సర్కిల్ నాయకులు శివారెడ్డి, రాజు, ఫయాజ్, డివిజన్ నాయకులు శ్రవణ్ కుమార్, సుధన్ రెడ్డి, ఉదయ్, కిరణ్, హరీష్ రెడ్డి, మహేందర్ రావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యవర్గ సభ్యులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వివాహ వేడుకలో పాల్గొన్న నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, మే 23 (సూర్య ప్రతినిధి):** నారాయణపురం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మెరుగు గిరి వివాహం పుట్టపాకలోని ఎస్.వి.ఎల్ ఫంక్షన్ హాల్లో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను %-% మెరుగు గిరి మరియు శరణ్యలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి రమేష్, మండల యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. స్థానికంగా ఈ వివాహ వేడుక వైభవంగా జరిగిందని హాజరైన అతిథులు పేర్కొన్నారు.

## తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-82 జెండా ఆవిష్కరణ

రాష్ట్ర నాయకులు షౌకత్ పాషా



**తుర్కయంజాల్, మే 23 (సూర్య ప్రతినిధి):** తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-82 నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు షౌకత్ పాషా, సాయిలు ముఖ్య అతిథులుగా హాజరై, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగుడ లోని ఇబ్రహీంపట్నం డివిజన్లలో నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెండా ఆవిష్కరణ ఒక గుర్తింపు కంటే ఎక్కువ. ఇది ఉద్యోగుల ఐక్యత, హక్కుల కోసం పోరాటానికి సంకేతం. కార్మికులు ఐక్యతతో ఉండి, తమ హక్కులను సాధించుకోవాలి. మా యూనియన్ ఉద్యోగుల పక్షంలో ఎల్లప్పుడూ నిలబడి, వారి సమస్యలపై రాజీ లేని పోరాటం చేస్తుంది, అని చెప్పారు. కార్యక్రమంలో ఉపేందర్, శ్రీకాంత్ రెడ్డి, కంపెనీ నాయకులు బాల్ రెడ్డి, కావలి వెంకటేష్,శివకుమార్ రెడ్డి, రాజు, పెద్దయ్యా, ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షులు పి రాజు, సెక్రటరీ మేకల ప్రవీణ్, శ్రీకాంత్, రాము, దేవేందర్, రాము, పెంటయ్య, శివ,డివిజన్ కార్యవర్గ సభ్యులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## సమర్ధవంతంగా పనిచేసే కార్యదర్శులే కావాలి

బాధ్యతతో పని చేయకపోతే వెళ్లి పోవాల్సిందే

గ్రామాభివృద్ధికి కార్యదర్శి అత్యంత కీలకం

కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి





**మునుగోడు, మే 23( సూర్య ప్రతినిధి):** పంచాయతీ కార్యదర్శుల పనితీరును బట్టి గ్రామాల అభివృద్ధి ఉంటుందని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.. మునుగోడు లోని అధికారిక క్యాంపు కార్యాలయంలో మునుగోడు మం డలంలోని గ్రామాల అభివృద్ధి, పంచాయతీ కార్యదర్శుల పనితీరుపై జిల్లా పంచాయతీ అధికారి, మండల అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, స్థానిక నాయకు లతో కలిసి సమావేశం నిర్వహించారు... ఈ సమావేశంలో సమర్థవం తంగా ఎవరు పనిచేస్తున్నారని ఆరా తీశారు... సమర్థవంతంగా పనిచేసే వాళ్ళే ఇక్కడ ఉండాలని, గ్రామాభివృద్ధి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారు ఇక్కడ ఉండొద్దని కరాకం డిగా చెప్పారు... గ్రామాలలో వాతావరణం బాగుండే విదంగా, గ్రామాలు అద్దంలా మెరిసే విధంగా, మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండే విదంగా, కార్యదర్శులు సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఇన్చార్జి ఎంపీడీవో విజయభాస్కర్, ఎంపీఓ స్వరూప స్థానిక నాయకులు పాల్గొన్నారు..

# దేశం గర్వించదగ్గ నేతలను విద్యాసంస్థలు అందించాయి

ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మూడ్ శోభన్ నాయక్



**చౌటుప్పల్, సూర్య ప్రతినిధి:** దేశం గర్వించదగ్గ నేతలను విద్యాసంస్థలే అందించాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మూడ్ శోభన్ అన్నారు. శుక్రవారం రోజున చౌటుప్పల్ మున్సిపాలిటీలోని చందన హైస్కూల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా శిక్షణ తరగతులు మూడోవ రోజునా మొదటి క్లాస్ భారత జాతీయోద్యమం మూడ్ శోభన్ నాయక్ బోధించారు, రెండో క్లాసును దోపిడీబిదోపిడీ పద్ధతులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి బోధించడం జరిగింది అనంతరం శోభన్ నాయక్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య సమరంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారు. జలియన్‌వాలాబాగ్ దురంతం అనంతరం విద్యాసంస్థలు పోరాట స్ఫూర్తితో రగిలాయి. జాతీయోద్యమం సైతం విద్యార్థులను స్వతంత్ర సంగ్రామంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. క్విట్ ఇండియా ఉద్యమంలో విద్యార్థులు పోషించిన పాత్ర అనిర్వచనీయం. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వంటి ఎందరో పోరాట యోధులను విద్యార్థి లోకం దేశ ప్రజలకు అర్పించింది. స్వాతంత్ర్యానంతరం కూడా విద్యార్థిలోకం ఇటువంటి చైతన్యవంతమైన పాత్రనే పోషించింది. కులవివక్ష, వరకట్నం, మహిళా సమస్యలు, అవినీతి, ఆర్థిక అసమానతలపై గళం విప్పింది. విద్యార్థుల చొరవతో కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అర్థవంతమైన చర్చలకు, ప్రజాస్వామ్య ప్రక్రియకు వేదికలుగా మారాయి. జాతి రత్నాలుగా ఖ్యాతి గాంచిన ఎందరో మేథావులను, దేశం గర్వించదగ్గ నేతలను విద్యాసంస్థల్లో విరాజిల్లిన ఈ ప్రజాతంత్ర వాతావరణమే అందించింది. ఇక్కడ సాగిన మేథోమథనం నుండే తొలితరం, మలితరం జాతీయ నాయకుల మస్తిష్కాలు వికసించాయి. అనంతర కాలంలో దేశాభివృద్ధికి తమ వంతు పాత్రను వారు పోషించారు. ప్రజాతంత్ర, సామాజిక ఉద్యమాల్లో విద్యార్థులు గణనీయమైన పాత్ర పోషించారు. 90వ దశకంలో ప్రారంభమైన సరళీకరణ ఆర్థిక విధానాలు, వాటితో పాటే ప్రారంభమైన విద్యారంగ సంస్కరణలు పరిస్థితిని మార్చివేశాయి. మేథోవికాసం కన్నా, బట్టీ పట్టే చదువుకు, ర్యాంకుల సాధనకు విద్యార్థులను పరిమితం చేశాయి. ప్రైవేటు, కార్పొరేట్ విద్య విస్తరణతో తరగతి గదులు ర్యాంకర్లను తయారు చేసే కర్మాగారాలుగా మారాయి. ఖర్చుకు వెనకాడకుండా చదువును కొనిస్తున్నామని తల్లిదండ్రులు మురిసిపోయారుగానీ, తమ పిల్లలను తమ చేతుల మీదగానే కార్పొరేట్ సరుకులుగా మారుస్తున్న విషయాన్ని గుర్తించలేకపోయారు. ఫలితం దేశానికి చోదక శక్తులుగా ఉండాల్సిన యువతరం నీరుగారింది. నవ శక్తులు నిర్వీర్యమయ్యాయి. సొంత లాభం తప్ప మరేమి అవసరం లేదన్న కార్పొరేట్ సంస్కృతి మెదళ్లలోకి ఇంకిపోవడతో సమాజంలో జరిగే అన్యాయాలకు, అక్రమాలకు స్పందించడం తగ్గింది. మరోవైపు మత విద్వేష రాజకీయాలతో చిచ్చు రాజేసే సమిధులుగా ఒక సెక్షన్ విద్యార్థులు తయారవడం ఆందోళనకర స్థాయికి చేరింది. హిందూత్వ, కార్పొరేట్ దోపిడి విధానాల విష సమ్మేళనం దేశాన్ని, దానితో పాటు విద్యా వ్యవస్థను అథోగతికి తెచ్చింది. ఆదర్శాలు, ఉద్యమ స్ఫూర్తి అడుగంటాయి. కళాశాలల్లో మాదకద్రవ్యాల విచ్చలవిడి వాడకం భావి పౌరుల్ని మత్తులో ఉంచుతోంది. విద్యారంగ పరిరక్షణతో పాటు, సమాజ పురోగతికి బాటలు వేసే పోరాటాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షు కార్యదర్శి చింతల శివ లావుడియ రాజు,జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్,కాసుల నరేష్,జిల్లా సహాయ కార్యదర్శి తిగుళ్ల శ్రీనివాస్,జిల్లా కమిటీ సభ్యులు భవాని శంకర్, నాయకులు వరుణ్,వంశీ, పవన్, కళ్యాణ్,విశాల్,విక్రమ్, శ్రీమాన్,సతీష్,వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు...

# విద్యారంగాన్ని గాలికొదిలేశారు

## గురుకుల ఇంటర్ కళాశాలల మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**తుర్కయంజాల్, మే 23, (సూర్య ప్రతినిధి ):** అఖిల భారత యువజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12 సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ కళాశాలలను ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 11 జిల్లాల్లో దాదాపు వందలాది మంది పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం అవుతున్నారని, ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో, జేఈఈ, ఏప్ సెట్ ఫలితాల్లో గురుకుల ఇంటర్ విద్యార్థులు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలతో పోటీ పడి మరి మంచి ర్యాంకులు, మార్కులు సాధించారని అలాంటప్పుడు విద్యార్థులు లేరనే సాకుతో కళాశాలలను మూసివేయడం కన్నా కళాశాలలను అభివృధి చేసి నిధులు కేటాయించి మరింత బలోపేతం చేయాలని, గురుకుల కళాశాలలో సరైన వసతులు కల్పించి నాణ్యమైన ఆహార భోజనాన్ని అందిస్తే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుందని అన్నారు.



ప్రభుత్వం వెంటనే ఎస్సీ గురుకుల కళాశాలల ఎత్తివేత


నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అనుమతులు లేకుండా కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగులాగా పుట్టుకొస్తున్నాయని, అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులను యాజమాన్యాలు మోసం చేస్తున్నాయన్నారు. ఇంత యధేచ్ఛగా అడ్మిషన్లు జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అనుమతి లేని ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల విద్య లో 10,519 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని, మరియు కొన్ని జిల్లాల్లో విద్యాశాఖ అధికారులు(డిఇఓ) లేరని, విద్యాశాఖలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## కర్ణాటకలో సైబర్ నేరస్థుడిని అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు



**ఖమ్మం( సూర్య ప్రతినిధి)** మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేస్తామని ఖమ్మంకి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి డిజిటల్ అరెస్టు చేసి సుమారు 1.12 కోట్ల రూపాయలు దోచుకున్న కేసులో వ్యక్తిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు సిపి సునీల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం అర్బన్ మండలంలోని టీచర్స్ కాలనికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అయిన నాగుల బ్రహ్మం కి ఫోన్ లో మనీ లాండరింగ్ పాల్పడారని ముంబాయి పోలీసులమని అరెస్టు చేస్తామని బెదిరించి అక్టోబర్- 2024 లో ఫలు ధఫాలుగా సుమారు 1.12 కోట్ల రూపాయలు దోచుకున్న కేసులో రూ. 32 లక్షలు అకౌంటికి వెళ్ళిన మహ్మద్ జాఫర్ బెల్గాం, వయస్సు 40 సం? రాల వ్యక్తిని కర్ణాటకలోని హుబ్లీలో అరెస్టు చేసినట్లు నిందుతున్ని సైబర్ క్రైమ్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కి తరలించారు అని తెలిపారు. ఈ కేసు విచారణలో ముఖ్య పాత్ర వహించి, కర్ణాటకలోని హుబ్లీలో నిందుతున్ని అరెస్టు చేసి, ఖమ్మంకి ట్రాన్సిట్ వారెంట్ ద్వారా తీసుకువచ్చిన సైబర్ క్రైమ్ డిఎస్పీ ఆర్ వి ఫణిందర్ ఎస్సై రంజిత్ కుమార్ ని సహకరించిన ఎస్సై విజయకుమార్ మరియు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సిపి అభినందించారు.

## బడే సాహెబ్ కుమారుడి వివాహంకు హాజరైన మంత్రులు తుమ్మల, పొంగులేటి



**ఖమ్మం (సూర్య ప్రతినిధి)** ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోదుమూరు గలో జ్యోతి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బడే సాహెబ్ కుమారుని వివాహంలో పాల్గొని వధూవరులకు ఆశీర్వాదం శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దూదేకుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ పుల్లా సాహెబ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ మీరా గోపాలపురం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ అన్వర్ పాషా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్ కలాం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సలీం కొనిజర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మీరా సాహెబ్ కైకొండాయిగూడెం, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుభాని బాబు జిల్లా సహాయ కార్యాదర్శి షేక్ సిద్ధిక్ జిల్లా సీనియర్ నాయకులు షేక్ ఇమామ్ భాయ్ జిల్లా నాయకులు అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి

**మద్దూర్ , మే 23:-** అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన మద్దూర్ పట్టణ కేంద్రంలో జరిగింది ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్సై విజయ్ కుమార్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కోయిలకొండ మండలం దమ్మాయిపల్లి గ్రామానికి చెందిన రామచంద్రయ్య అనే వ్యక్తి (42) మద్దూర్ లో గత కొన్ని సంవత్సరాల నుంచి వెంకటేశ్వర డయాగ్నొస్టిక్ నడుపుతూ అదే విధంగా కోస్గిలో నూతనంగా మరొక డయాగ్నస్టిక్ సెంటర్ ను ప్రారంభించి నష్టం రావడం వలన మనోవేదనకు గురై అదేవిధంగా మద్దూర్ లో కూడా నష్టం వచ్చి అప్పు తీసుకున్న వారి నుంచి ఒత్తిడి రావడం వలన ఆ బాధ భరించలేక శుక్రవారం ఉదయం తన ఇంట్లో భార్య పిల్లలు ఇంట్లో లేని సమయం చూసి ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఉరివేసుకోవడం జరిగిందని ఎస్సై వివరించారు. రామచంద్రయ్య తమ్ముడు సత్యం యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఎస్సై వివరించారు.




## అక్రమ నిర్మాణం పై విచారణ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు



మర్రిగూడ సూర్యప్రతినిధి వట్టిపల్లి గ్రామంలో అక్రమ నిర్మాణం పై విచారణ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు నల్గొండ జిల్లా మర్రిగూడ మండల్ వట్టిపల్లి గ్రామంలో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై జిల్లా లెవెల్ ప్లానింగ్ ఆఫీసర్ డిఎల్పిఓ శంకర్ నాయక్ విచారణ ప్రారంభించారు గ్రామానికి చెందిన మల్లి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మానవ హక్కుల సంఘం ఆశ్రయించడంతో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అధికారులు స్పందించారు గత కొంతకాలం తండ్రీ కొడుకుల మధ్య జరుగుతున్న వివాదంలో గ్రామపంచాయతీ మౌలిక సదుపాయాలు ఇంటి టాక్స్ వసూలు పై అనుమానాలు తలెత్తి నా నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు విచారణ కొనసాగింది ఏపీవో రవి కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ సమక్షంలో ఇరుపక్షాల వాదనలు ఆలకించారు అక్రమ నిర్మాణం నానికి పంచాయతీ ఎలా అనుమతి మంజూరు చేసింది పన్ను వసూలు ఎలా జరుపుతున్నారని దానిపై డిఎల్పిఓ నిక్కిలంగా పరిశీలించారు సమితి పత్రాలను పరిశీలించిన తర్వాత తుది నివేదిక సిద్ధం చేయనున్నారు గ్రామస్తులు అభిప్రాయం మేరకు శంకర్ నాయక్ నివేదిక ఆధారంగా ఈ వివేదానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది ఫిర్యాదు దారుడు శ్రీనివాస్ రెడ్డి నిర్మాణం తక్షణమే కూల్చివేయాలని డిమాండ్తో ముందుకు వచ్చినట్టు సమాచారం

## శిక్షణా శిబిరాన్ని సందర్శించిన ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితా రానా ఐఏఎస్





**గండి పేట్ : సూర్య ప్రతినిధి** నగరంలోని ఎడిఫై స్కూల్" ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ యోగితా రానా ఐఏఎస్ శుక్రవారం సందర్శించారు. ఆమెతో పాటు సీక్రెట్ డైరెక్టర్ రమేష్, డీఈఓ సూసిందర్ రావు, కోర్సు డైరెక్టర్ శంకర్ రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేడం యోగితా రానా ఉపాధ్యాయులకు పలు ముఖ్య అంశాలను వివరించారు. రాష్ట్రం ఎన్ఏఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)లో 36వ స్థానంలో ఉందని, ఇది పునర్విమర్శకు ఆవశ్యకతను సూచిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల నమ్మకం పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. విద్యార్థుల నమోదులో తేడాలు కనిపిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని, నాణ్యమైన బోధనను అందించాలని ఆమె అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న ఉత్తమమైన ఉపాధ్యాయులు, వారి అర్హతలు గ్రామస్థులకు తెలియజేయాలని సూచించారు. ఖాన్ అకాడమీతో ఒప్పందం ద్వారా డిజిటల్ బోధనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. శిక్షణ ముగిసిన తర్వాత గ్రామస్థులకు దీని ప్రాముఖ్యతను తెలియజేయాలని, విద్యార్థుల చేరిక పెరిగేలా చూడాలని కోరారు. శిక్షణలో ఉపాధ్యాయుల స్పందనపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఎదురెదురుగా రెండు స్కూటీలు ఢీ.. ఇద్దరికి గాయాలు



**గుండాల, సూర్య ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా: గుండాల మండల పరిధిలోని సుద్దాల గ్రామ శివారులో శుక్రవారం సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా రెండు స్కూటీలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు సుద్దాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తమ్ముడు గూడ వెంకటేష్ స్కూటీపై సుద్దాల నుండి అనంతారం వైపు గుండాల మండలానికి చెందిన మహమ్మద్ అల్తాఫ్ అనంతరం నుండి సుద్దాలకు వైపు వెళుతున్నారు ఈ క్రమంలో గ్రామ సమీపంలో స్కూటీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రంగా గాయాలు అయ్యాయి విషయం తెలుసుకున్న గుండాల ఎస్సై జి సైదులు క్షేత్రగాతులను 108 అంబులెన్స్ లో ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అక్రమాలు చేస్తే చర్యలు తప్పవు

**హైదరాబాద్ :** తెలంగాణలో పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందించనుంది. ఈ పథకం కోసం లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం వీటిని నిశితంగా పరిశీలించి.. అర్హులైన వారికి ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ ప్రారంభించింది మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు జరిగితే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడైనా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే.. వాటిని మంజూరు చేసిన అధికారులపైనే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవసరమైతే అలాంటి అదికారుల సర్వీసు రద్దు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తే.. ముందుగా సదరు అధికారిని సస్పెండ్ చేస్తామని.. ఆ తర్వాత నిజనిర్ధారణ చేసి.. ఆరోపణలు వాస్తవమని తేలితే.. అలాంటి అధికారిని సర్వీస్ నుంచి రిమూవ్ చేస్తామని వెల్లడించారు.

# బాబుల్ రెడ్డి నగర్ మహిళా భవనంలో పాఠశాల సంసిద్ధత మేళా





భవిష్యత్ విద్యార్థులకు బలమైన అడుగులు

పిల్లలలో ప్రతిభను వెలికితీయాలి

పాఠశాల మేళాలో డివిజన్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఎస్. వెంకటేష్ కురుమ పిలుపు

**గండిపేట్ : సూర్య ప్రతినిధి** రాజేంద్రనగర్ సర్కిల్ శేర్లింగంపల్లి ప్రాజెక్ట్ మైలర్ దేవ్ పల్లి సెక్టర్ బాబుల్ రెడ్డి నగర్ మహిళా భవనంలో ప్రథమ్ ఫౌండేషన్ హిమ బిందు, అంగన్వాడి కేంద్రం -2 అనిత ఆధ్వర్యంలో పాఠశాల సంసిద్ధత మేళా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా బి ఆర్ ఎస్ పార్టీ మైలర్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ కురుమ హాజరై మాట్లాడుతూ... చిన్నారులకు విద్యారంభంలో మౌలిక నైపుణ్యాలు, అనుకూల వాతావరణం కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాల మాధ్యమంగా చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడం వల్ల భవిష్యత్తులో వారు నైపుణ్యం గల విద్యార్థులుగా ఎదగగలరని అన్నారు. నవయువ యాత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ...చిన్నారులకు విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే ఈ విధమైన మేళాలు వారిలో ఆసక్తిని రేకెత్తిస్తాయి. చిన్న వయస్సులోనే విద్యాబోధన ప్రారంభమైతే, పిల్లలు భవిష్యత్తులో మెరుగైన స్థాయికి చేరగలరు అని అన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ కవిత మాట్లాడుతూ... ఈ మేళా ద్వారా చిన్నారుల్లో శారీరక, మానసిక, సామాజిక మరియు భావనాత్మక అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యం. పిల్లలు ఆటల ద్వారా నేర్చుకుంటారు అనే సూత్రంతో, ఈ కార్యక్రమంలో అనేక రకాల గేమ్స్, కథల కార్యక్రమాలు, బొమ్మల ప్రదర్శనలు, అభినయ నాటికలు, మరియు కళా కార్యక్రమాలు నిర్వహిస్తారు అని అన్నారు క్లబ్ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, సూపర్వైజర్, పద్మజ ఎస్. అశోక్, సునీల్, అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, మాధవి, రత్న, గౌరీ, ప్రేమ దేవి, ఆశవర్కర్లు మంగ, మణెమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం పూర్వ విద్యార్థులు



**గుండాల, సూర్య ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి జిల్లా: గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో ఇటీవల అకాల మృతి చెందిన పెగ్గపురం శేఖర్ తండ్రి రాములు కుటుంబ సభ్యులకు ఆ గ్రామ జడ్.పి.హెచ్.ఎస్ 2000- 2001 బ్యాచ్ కు చెందిన మిత్రులు రూ.7000/- ఆర్థిక సహాయం అందించారు.. అతనికి ఒక కుమారుడు 7సంవత్సరాలు,ఒక కుమార్తె 5 సంవత్సరాల పిల్లలు ఉన్నారు... నిరుపేద కుటుంబానికి చెందిన శేఖర్ అకస్మాత్తుగా చనిపోవడంతో అతని పిల్లల భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారింది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి మంచి విద్యతోపాటు మంచి భవిష్యత్తును అందించాలని అతని పిల్లల పేర్ల పై కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలని ముందుకు వచ్చారు.. ఈ కార్యక్రమంలో బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, మల్లిపెద్ది మల్లారెడ్డి వల్లందాస్ ప్రభాకర్, జోగు శేఖర్, జోగు స్వామి, కేమిడి రవికుమార్, మచ్చ మహేందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి చిటుకుల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నాతి సాలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన నాతి కుటుంబ సభ్యులు



**సంస్థాన్ నారాయణపూర్, మే 23( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల జనగాం గ్రామానికి చెందిన నాతి సాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన నాతి కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో నాతి బంధుమిత్రుడు తదితరులు పాల్గొన్నారు

# ఈడీ చిక్కుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు మొదలు పెట్టిన కేటీఆర్





**హైదరాబాద్ :** కాంగ్రెస్‌ను చికాకు పెడుతున్న కేసుల్లో నేషనల్ హెరాల్డ్ కేసు ఒకటి. ఇందులో నిందితులుగా రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోపాటు మరో ఐదుగురు ఉన్నారు. ఇప్పుడు ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రికి కూడా భాగం ఉందని ఈడీ పేర్కొనడంతో సంచలనంగా మారుతోంది. దీంతో ప్రతిపక్షాలు కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నాయి. నేషనల్ హెరాల్డ్ కేసులో గత నెలలోనే ఈడీ ఛార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పిం చింది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు ఐదుగుర్ని నిందితులుగా చేర్చింది. కానీ ఈ కేసులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పవన్ బన్సల్, చనిపోయిన నేత అహ్మద్ పటేల్ పేర్లు రావడం ఇప్పుడు సంచలనంగా మారుతోంది. యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసి అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆస్తులు కొట్టేయడానికి యత్నించారని ఈడీ ఆరోపిస్తోంది. ఈ ఆస్తుల విలువ దాదాపు రెండు వేల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ యంగ్ ఇండియా సంస్థ ఏర్పాటులో చాలా మంది కాంగ్రెస్ నేతలు భాగమయ్యారని 2019-22 మధ్య విరాళాల రూపంలో డబ్బులు వసూలు చేశారని పేర్కొంది ఈడీ. పదవులు, ఇతర ప్రయోజనాలు ఎర చూపించి డబ్బులు వసూలు చేసినట్టు పేర్కొంది. అందులో అప్పటి పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి, పవన్ బన్సల్, అహ్మద్ పటేల్ భాగమయ్యారని తెలిపింది. పూర్తి స్థాయి విచారణ తర్వాత ఈ విషయాన్ని ఛార్జిషీట్‌లో పెట్టినట్టు ఈడీ వెల్లడించింది. ఈ కేసులో విచారణలో భాగంగా గతంలో సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, అంజన్ కుమార్ యాదవ్, గీతారెడ్డి, గాలి అనిల్ కుమార్‌ను కూడా ఈడీ విచారించింది. ఇప్పుడు ఈడీ ఛార్జ్‌షీట్‌ను అస్త్రంగా మార్చుకుంటోంది బీఆర్ఎస్. ఈ విషయంపై కేటీర్ ట్వీట్ చేశారు. రేవంత్ రెడ్డి అవినీతి ఈడీ కేసుతో తేటతెల్లమైందని పేర్కొన్నారు." యంగ్ ఇండియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టినట్టు ఈడీ నమోదు చేసిన చార్జిషీట్‌తో సీఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైంది. అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్లైంది. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సీఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరింది. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఈడీ కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ? పొంగులేటి తరహాలో చీకట్లో బీజేపీ పెద్దల కాళ్లు పట్టుకుంటారా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఈడీ, కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా ? లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా ??" అని అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికలమైందన్నారు కేటీఆర్. పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సీఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోందని విమర్శించారు. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అటెన్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టేనని అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ పార్టీ ఫ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయినట్టు అయిందన్నారు కేటీఆర్. కమీషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకాలన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయని తెలిపారు. 30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వంలో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నాలుగు కోట్ల ప్రజల ముందు ముఖ్యమంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టుకుంటోందని ఎద్దేవా చేశారు కేటీఆర్. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీచేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండింది... చివరికి ధర్మం గెలుస్తుందని అభిప్రాయపడ్డారు



# గరుడన్ తెలుగు రీమేకె 'భైరవం' ఏ ఓటీటీలో ఉందంటే

'భైరవం' సినిమా మే 30న విడుదల కానుంది. ఇప్పుడు ఈ సినిమా పరిస్థితి ఎలా ఉందంటే  ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా ఉంది. ఈ సినిమా ఓరిజినల్ కాపీ అమెజాన్ ప్రైమ్‌లో ట్రెండ్ అవుతుంది. అలాంటప్పుడు రీమేక్ భైరవం కోసం జనాలు థియేటర్‌కు వస్తారా అనే సందేహాలు వస్తున్నాయి. మరోవైపు ఈ సినిమా దర్శకుడు విజయ్ కనకమేడల నోటిదురుసు వల్ల బాయ్‌కాట్ భైరవం అనే హ్యాష్‌ట్యాగ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఒకవైపు వైఎస్సార్‌సీపీ ఫ్యాన్స్..మరోవైపు మెగా అభిమానులు భైరవం సినిమా చూడొద్దని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున్న ప్రచారం చేస్తున్నారు. తమిళ సినిమా 'గరుడన్'కు రీమేక్‌గా 'భైరవం' సినిమాను విజయ్ కనకమేడల తెరకెక్కించాడు. గతేడాదిలో తమిళ్‌లో మాత్రమే విడుదలైన గరుడన్ భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది.తమిళ నటుడు సూరి లీడ్ రోల్లో నటించగా అతని స్నేహితులుగా శశికుమార్, ఉన్నిముకుందన్ కీలకపాత్రలు పోషించారు. ఈ రూరల్ యాక్షన్ డ్రామాను ఆర్ఎస్ దురైసెంథిల్ కుమార్ డైరెక్ట్ చేశాడు. రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిస్తే.. రూ. 50 కోట్లకు పైగానే కలెక్షన్స్ సాధించింది. వెట్రిమారన్ కథ అందించాడు. భైరవంలో కూడా ముగ్గురు హీరోలు బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ నటించారు. గరుడన్ కథ నచ్చే తెలుగు ప్రేక్షకులకు కూడా చూపించాలని భైరవం తీస్తున్నట్లు దర్శకుడు విజయ్ కనకమేడల ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. అయితే, మాతృకతో పోలిస్తే మన ప్రేక్షకులకు నచ్చేలా అవసరమైన మార్పులు చేసి ఈ సినిమాను తెరకెక్కించామన్నారు. ఒరిజినల్ వర్షన్ చూసిన వాళ్లకి కూడా కొత్త అనుభూతిని అందించేలా ఈ కథలో మార్పులు చేసినట్లు ఆయన అన్నారు.


# రెండు వారాల్లో ప్రభాస్ 'ది రాజాసాబ్' టీజర్

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు సమాచారం. అయితే ఈ మూవీ నుంచి తాజాగా ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మరో రెండు వారాల్లో రాజాసాబ్ టీజర్ రాబోతుందని బేబి నిర్మాత ఎస్‌కేఎన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఒక మూవీ ఈవెంట్‌లో ఆయన వెల్లడించారు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. హారర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. రిద్ధి కుమార్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.









# పవన్ ఎఫెక్ట్.. త్రివిక్రమ్‌తో చరణ్ మూవీ.. సుక్కు సినిమాకి బ్రేక్!

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో వచ్చిన 'గుంటూరు కారం' (2024) సినిమా విడుదలై ఏడాదిన్నర దాటినప్పటికీ, ఆయన తదుపరి చిత్రంపై స్పష్టత లేకపోవడం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. మొదట్లో అల్లు అర్జున్‌తో పాన్-ఇండియా చిత్రం కోసం ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ, అది వర్కౌట్ కాలేదు.   ప్రస్తుతం అల్లు అర్జున్.. తమిళ దర్శకుడు అట్లీతో ఓ చిత్రంలో నటిస్తున్నాడు. ఈ ప్రాజెక్టు 2026 వరకు పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో, త్రివిక్రమ్  సినిమా తాత్కాలికంగా వాయిదా పడినట్లు మొన్నటిదాక ప్రచారం జరిగింది. ఇప్పుడు మొత్తానికి ఈ చిత్రం ఉండకపోవచ్చని టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. బన్నీ ప్రాజెక్ట్‌ని పక్కకు పెట్టి రామ్ చరణ్‌తో పాన్ ఇండియా సినిమా చేసేందుకు త్రివిక్రమ్ రెడీ అవుతున్నాడట.

వెంకీ చిత్రం తర్వాత...

బన్నీ సినిమా వాయిదా పడడంతో  త్రివిక్రమ్ ఈ గ్యాప్‌లో విక్టరీ వెంకటేశ్‌తో ఓ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించేందుకు రెడీ అయ్యాడట. ఈ చిత్రం కథా చర్చలు పూర్తయి, మరికొద్ది రోజుల్లో  సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం. ఇది పూర్తయిన తర్వాత బన్నీతో సినిమా చేస్తాడని మొన్నటి దాకా ప్రచారం జరిగింది. కానీ అది కూడా జరిగేలా లేదు. త్రివిక్రమ్ ఆ ప్రాజెక్టుని పూర్తిగా పక్కకు పెట్టేసి.. రామ్ చరణ్‌తో సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు. పవన్ కల్యాణ్ చొరవతో రామ్ చరణ్ కోసం త్రివిక్రమ్ ఓ క్రేజీ కథను రెడీ చేశాడట. ఇటీవల ఈ కథను చరణ్‌కు చెప్పి ఒప్పించారట. ఈ చిత్రానికి త్రివిక్రమ్ సన్నిహితుడైన పవన్ కల్యాణ్ నిర్మాతగా వ్యవహరించబోతున్నట్లు సమాచారం. పెద్ది చిత్రం పూర్తయిన వెంటనే చరణ్ త్రివిక్రమ్ సినిమాని సెట్స్‌పైకి వెళ్తుందని టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది.  వాస్తవానికి పెద్ది తర్వాత చరణ్ .. సుకుమార్‌తో సినిమా చేయాల్సింది. ఇటీవల సుకుమార్ కూడా తన తదుపరి సినిమా చరణ్‌తోనే అని ప్రకటించాడు. కానీ పవన్ కల్యాణ్ కారణంగా చరణ్.. సుక్కు ప్రాజెక్టుని పక్కకు పెట్టి..త్రివిక్రమ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడట. ఈ చిత్రం తర్వాత సుకుమార్‌తో సినిమా చేయాలని భావిస్తున్నాడట. మరి సుక్కు అంతకాలం వెయిట్ చేస్తాడా లేదా మధ్యలో మరో హీరోని చూస్కొని సినిమా చేస్తాడా అనేది తెలియాల్సింది.

# విక్రమ్ సరసన క్రేజీ హీరోయిన్‌కు ఛాన్స్.. హిట్ కాంబినేషన్

చిత్రపరిశ్రమలో వైవిధ్య భరిత కథాచిత్రాలకు కేరాఫ్ చియాన్ విక్రమ్. ఈయన తాను నటించే ప్రతి చిత్రంలోనూ కొత్తగా కనిపించడానికి ప్రయత్నిస్తుంటారు. అలా ఇటీవల తంగలాన్, వీర ధీర సూరన్ చిత్రాల్లో నటించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. కాగా తాజాగా విక్రమ్ తన 63వ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి మడోనా అశ్విన్ కథ, దర్శకత్వం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతకుముందు మండేలా, మావీరన్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలకు దర్శకత్వం వహించారన్నది గమనార్హం. కాగా ఈ క్రేజీ చిత్రాన్ని శాంతి పిక్చర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సంస్థ ఇంతకుముందు శివకార్తికేయన్ కథానాయకుడిగా మావీరన్ వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిందన్నది గమనార్హం. కాగా తాజాగా విక్రమ్ హీరోగా నిర్మించే చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయితే ఇందులో విక్రమ్ సరసన నటించే హీరోయిన్ ఎవరన్నది ఆసక్తిగా మారింది. ఇప్పటికే నటి ప్రియాంక మోహన్, అలాగే శ్రీనిధిశెట్టిలలో ఒకరు నటింపజేసే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. కాగా తాజాగా లక్కీ కథానాయకి మీనాక్షి చౌదరిని నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.  ఈ కన్నడ బ్యూటీ ఇటీవల తెలుగు, తమిళ భాషల్లో మంచి రేసింగ్‌లో ఉన్నారు. ఈమె ఇంతకు ముందు తమిళ్, తెలుగు భాషల్లో దుల్కర్ సల్మాన్‌కు జంటగా నటించిన లక్కీ భాస్కర్ చిత్రం మంచి విజయాన్ని సాధించింది. అలాగే వెంకటేష్ సరసన నటించిన తెలుగు చిత్రం సంక్రాంతికి వస్తున్నాం కూడా సూపర్ హిట్ అయింది. దీంతో ప్రస్తుతం ఈమె క్రేజీ కథానాయకిగా వెలుగొందుతున్నారు. కాగా మరోసారి తమిళంలో విక్రమ్‌తో జత కట్టడానికి రెడీ అవుతారా? అన్నది వేచి చూడాలి.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.